PDF Compressor Pro

# ముకుందమాల



అనువాదకుఁడు
కవిశేఖర
గురుజాడ రాఘవశర్మ

బృందావన ప్రచురణములు
మచిలీపట్టణము.

PDF Compressor Pro

# ముకుందమాల

[శ్రీ కులశేఖర మహారాజ విరచితము]

అనువాదకుఁడు

కవిశేఖర

గురుజాడ రాఘవశర్మ

బృందావన ప్రచురణాలయము
మచిలీపట్టణము

PDF Compressor Pro

పంచమ ముద్రణ
శ్రీ దుర్మతి శ్రావణము
1000 ప్రతులు

ప్రచురణ
బృందావన ప్రచురములు
మచిలీపట్టణము

సర్వస్వామ్యములు రచయితవి

వెల రు. 2-50

ముద్రణ :
కేశవ ప్రింటింగ్ ప్రెస్,
విజయవాడ-520004.

PDF Compressor Pro

# ఆశీస్సులు

శ్రియఃపతియు, సవాప్త సమస్త కాముఁడును, సకల కాల్యాణ గుణ సంపూర్ణుఁడు నైన శ్రీమన్నారాయణుని స్వరూప రూపగుణ విభూతులను ప్రతిపాదించెడు ప్రమాణ గ్రంథముల యందు గీతలలో భగవద్గీతవలె స్తోత్రము లలో 'ముకుందమాల" యాసేతు హిమాచలము మహావ్యాప్తిఁగాంచి, సత్సంప్ర దాయాను వర్తులగు, సకలాస్తిక జనులచేతను, బరమ విశ్వాసపూర్వకముగాఁ బఠన పాఠనాదులచేఁ బరిగ్రహింపఁ బడుచుండుట సర్వజన విదితమైన విషయమేకదా!

శ్రీ ముకుందమాలను రచించినవారు సుక్షత్రియకుల శేఖరులైన కులశేఖరులు. వీరు భక్తి మతములలోఁ బ్రధానమతమైన విశిష్టాద్వైతమునకు సంబంధించిన, పన్నిద్దరాళ్వారులలో నొకరనియు, వీరు ద్రావిడభాషయందుఁ గూడ ననేక దివ్యప్రబంధములను నిబంధించి యున్నవారనియు, తక్కిన యాళ్వారులకు వలెనే వీరికిని శ్రీ రామాయణమందుఁ బరమ ప్రీతి యనియు, నిత్యమును శ్రీరామాయణ కాలక్షేపము జరుపుచు నా యా ఘట్టములయందు సంపూర్ణముగాఁ బారవశ్యమును జెందుచుండురనియు, భాగవత కైంకర్యమందు మిక్కిలి నిష్ఠగలవారనియు, భగవత్సాక్షాత్కార లాభమును బడసిన మహా భాగ్యవంతులనియు, శ్రీవైష్ణవు లగు వారియం దెట్టిదోషము గూడ నుండదని నిదర్శనపూర్వకముగా నిరూపించి రనియు, నిత్యాది బహు విషయములు "ప్రపన్నామృతము" "గురుపరంపరా ప్రభావము" "ఆచార్యసూక్తిముక్తావళి" మున్నగు పూర్వాచార ప్రబంధముల వలన దెలియవచ్చు చున్నయది.

అర్థవిశేషమును బట్టియేగాక మార్దవము, మాధుర్యము మొదలగువానిం బట్టియు గీర్వాణభాషా గ్రంథమైనను, ఈ స్తోత్రరత్నము బహు భాషలలోఁ

PDF Compressor Pro



బరివర్తనము జెందియున్నది. ఆంధ్రభాష యందును దీని ననేకు లనేక రీతుల (పద్యములుగాను, పాటలుగాను) ననువదించి యున్నవారు. వారిలో ప్రకృత గ్రంథకర్తలగు బ్రహ్మశ్రీ గురుజాడ వీరరాఘవశర్మగా రొక్కరై యున్నవారు.

ఇంచుమించుగా నిప్పటికి 10 సంవత్సరములక్రిందట వీరు శ్రీకృష్ణాష్టోత్తర శతనామస్తోత్రమును "శ్రీ వాసుదేవనామశతకము" అను పేర, స్వతంత్ర గ్రంథముగా రచించి, యొక సంవత్సరముక్రిందట ముకుందమాల యను నీ స్తోత్రము నాంధ్రీకరించి యున్నవారు.

దీనిని శర్మగారు స్వయముగాఁ బఠించుచుండ విను భాగ్యము నాకు లభించినది. పెక్కురు సుప్రసిద్ధ విద్వత్కవిశేఖరు లొసంగిన యభిప్రాయములను బట్టియే వీరి యాంధ్రీకరణ మెట్టి యుత్తమశ్రేణికిఁ జెందినదో తెలిసికొనవచ్చును. పరమభాగవతోత్తములగు కులశేఖరు లెట్లు నిస్స్వార్థముగా సకలచేతనోజ్జీవమునకై గీర్వాణభాషయందీ స్తోత్రమును రచించిరో పరమభక్తాగ్రగణ్యులగు శ్రీ శర్మగారును అట్లే సంసారార్ణవపతితులైన యస్మదాదులుగూడ సుఖముగాఁ దరించుట్లీ యాంధ్రీకరణమును గావించియున్నవారని నా యభిప్రాయము.

ఆంధ్రీకరణము మృదు మధుర పదభూయిష్ఠమై గంభీరార్థ గర్భితమై మూలగ్రంథమునకు ఛాయవలె నొప్పును. నిర్దోషమును, నిఖిలసంపన్నమునై "మూలగ్రంథములోని సర్వవిశేషములను వీరు బహు శ్రద్ధావిశ్వాసములతోఁ బరిశోధించి గ్రహించి యున్నవా"రని నిరూపించుచున్నయది.

సకలశాస్త్రవేత్తలైన శ్రీ కులశేఖరు లేదే నొక యభిప్రాయముతోఁగాక, యూరక ప్రయోగింపరను విశ్వాసముతో మూలగ్రంథములోని ప్రతి నామమును మార్పు గావింపక ఒక్కొక్కటియు విడువక వీరును తమ యాంధ్రీకరణమందుఁ గూర్చి యున్నవారు.

PDF Compressor Pro



భావమును సమగ్రముగా విశదీకరించుచుఁ జిన్న శ్లోకమును బెద్ద పద్యముగాను – పెద్ద శ్లోకమును జిన్న పద్యముగాను అనువదించుటంబట్టి వీరికి రచనయం దెంత స్వాధీనత కలదో తెల్లము గాఁగలదు. "క॥ శ్రీవల్లభ" యను చిన్నపద్యమును "శ్రీవల్లభేతి" యను పెద్ద శ్లోకమునకు "చ॥ తమదయ" యను పెద్ద పద్యమును, "దివివా భువివా" యను చిన్నశ్లోకమునకు, ఉదాహరణముగాఁ గొనవచ్చును. "సీ॥ నీ పదాంబుజభక్తి" 'సీ॥ కేశవుగూరిచి" "చ॥ నను గరుణింపఁగా" ఇత్యాదులా యా శ్లోకముల ననువదించినపుడు వానిలోని యర్థ విశేషములయందలి యత్యాదరముచేఁ దృప్తిఁజెందక పాఠాంతరములుగా వ్రాయబడినవి.

క్షుద్రములైన యైహిక ప్రయోజనముల కాసించి, యపరమార్థములైన గ్రంథాభాసముల రచనచే, దమ లేఖినిని గళంకితము గావింపక, యుచ్చారణమాత్రముననే సకల సంసారబంధములను బటాపంచలు గావించి పరమ పురుషార్థమును లభింపఁజేయు సద్గ్రంథ రచనచేఁ దాము తరించుటయేగాక, విశ్వమును గూడ దరింపఁ జేయుచున్న శ్రీ గురుజాడ వీరరాఘవశర్మగారికి "శ్రీవల్లభుడితోధికముగా నాత్మోన్నత్యమును; భక్తిజ్ఞానములను, బ్రసాదించుచుఁ జిరాయురారోగ్యైశ్వర్యముల ననుగ్రహించుగాక" యని ప్రార్థించుచున్నాఁడను.

ఇట్లు,
సంపన్ముడుంబ సింగరాచార్యులు,
శతావధాని.

జగ్గయ్యపేట,

PDF Compressor Pro

# ఆశీస్సులు

## శ్రీ ముకుందమాల

దీనిని జాలమంది తెనుగున కనువదించిరి. ఆ యనువాదకులలో శ్రీ గురుజాడ వీరరాఘవశర్మగారొకరు. వీరి యనువాదము, చాల భాగము నేను వింటిని. నిర్దుష్టముగను, ప్రసాద గుణోపేతముగను, ధారాళముగను, మూలానుసరణముగను నున్నదనుటకు సందియము లేదు.

ఇది సూత్రప్రాయమగు నా యభిప్రాయము.

బెజవాడ,
శ్రీ తారణ కార్తీక బ ౧౩
సోమవారము.

(Sd.) చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి,
శతావధాని
13_1_44

శ్రీమాన్ కవిరత్న

## గుదిమెళ్ళ రామానుజాచార్యులుగారు

మూడవసారి మీరచన ముద్రకు వచ్చె "ముకుందమాల" యీ
నా డిటువంటి భాగ్య మధునాతన సత్కవులందు మీకుఁ జే
గూడెను, మీకవిత్వము, ముకుందునికంత ముకుందమాలగా
వాడక దాల్చుఁగావుత, సువాసనతో విబుధాళు లుబ్బగన్.

శ్రీగురుజాడ వారి కవిశేఖరుఁడే"కులశేఖరుం" డనన్
బాగుగ వ్రాయగల్గె సురభాషగనున్న ముకుందమాల, యీ
లాగున నాంధ్రభాష భళిరా !యన, రాఘవశర్మగారి, యీ
మాగిన ద్రాక్షవంటి కృతి మాకతి భోగ్యముగాఁ గనబడెన్.

PDF Compressor Pro

# అభినందనము

ప్రొద్దుటూరు
27—9—47

శ్రీ శ్రీ గురుజాడ రాఘవశర్మగారి పరిచయము, నాకు ముక్త్యాల సన్మాన సభలోఁ గలిగినది. వారి రచనలు—"శ్రీ వాసుదేవనామశతకము"— 'ముకుందమాల'యు, ఆ పరిచయము నాత్మబంధుత్వమునకుఁ జేర్చి, ఆప్యాయనము చేకూర్చినవి. "కృష్ణః వాసుదేవప్రభూః" అను సంబోధనముతో, భక్తిపరిప్లుతమైన వారి భావపూర్ణచ్ఛందోగానము, ఎట్టి ఆర్ద్రహృదయమునైన, నమృతము గురిసి యానందమునన్ దేల్పగలదు. ఆయన హృదయమెంత విశుద్ధమో, రచన యంత ప్రబుధము — సహజము—సరళము. అనువాదమే యైనను, ముకుందమాల స్వతంత్ర రచనకేమాత్రముఁ దీసిపోదు. ఆ యన్న కిది తమ్ముఁడువలె నన్నివిధముల నందగించినది. పుడమి చీల్చుకొని పొంగిన బుగ్గవంటి ఈయన కవితాధారను తలంచి నపుడు 'గోపాలమంత్రమే శర్మకుఁ గవితామంత్రమైనది' అను శ్రీ వెంకటేశ్వరరావు గారి వాక్యము అక్షరాలా సత్యమని నాకుదోచినది.

భక్తిరస ప్రపూర్ణములైన యిట్టి రచనలు మానవ జాతికి మంగళప్రదములు కాగలవనియు, విశేషించి ఈనాఁడు శాంతసత్పథముల సమకూర్పఁ గలవనియు ఆసించుచున్నాను. ఇట్టి సత్కావ్యముల మఱికొన్ని రచించి శ్రీ గోపాలదేవునకు నివేదించి లోకము దోయిళ్ళఁ బెట్టుదురుగాక యని శ్రీ శర్మగారిని కోరుచున్నాను.

గడియారం వెంకటశేష శాస్త్రి
27—9—47

PDF Compressor Pro

ఉభయభాషా ప్రవీణ, వేదాంతపారీణ, కవిశేఖర!

## మిన్నికంటి గురునాథశర్మగారు, గుంటూరు

కవిశేఖర శ్రీ గురుజాడ రాఘవశర్మగారు తెనిగించిన ముకుందమాలను నేను జదువుకొనుచున్నప్పటికంటె, వారు చదువుచున్నప్పుడు విని యానందమో యానంద పారవశ్యమో—లేక భక్తి పారవశ్యమో పొందితిని. వారు భక్తాగ్రేసరులు. శ్రీకృష్ణ భక్తులు భక్తిరసములో మునిగిఁ దేహము తెలియక గొంతెత్తి పాడుదురు. వారా శ్లోకముల నెన్నిపర్యాయము లట్లు పఠించి పఠించి, తనివి దీఱక చివరకెట్లు తెనిఁగించిరో—

ముకుందమాలలో సుప్రసిద్ధశ్లోకములు కలవు. "జిహ్వే కీర్తయ...." వంటి వృత్తమును యతిప్రాసములుగల యా వృత్తములోనే వ్రాయుట యెవ్వరికిని మిక్కిలి కష్టము. కుదించి వ్రాయవచ్చుఁగాని యప్పుడు దానియందము మందమగును. కాననే వీరు కుదించిన బస్తాను చేయక సంబుద్ధులు విడిచి ధారాళముగా వ్రాసిరి.

ఐనను గొఱఁత కొఱఁతయేకదా! కానఁ బెద్ద పొట్టగల సీస మెత్తుకొనిరి. పొట్టనిండించిరి కాని యించుక సందుంచుకొని 'హరి యొసంగు శరీర ' మాతనికే యిచ్చుటమేలుగదాయని యందలి గుట్టును బెట్టబెట్టి తృప్తి పడిరి. ఇట్లే కొన్నియెడల వృత్తము వ్రాసి తృప్తిపడక సీసమును వ్రాసి మూలార్థమును జెడిపోనీరైరి. 'హేగోపాలక....' వంటి శ్లోకము తెలిఁగించుటెట్లు? పైగాఁ దెలుంగున సంకెలలుండె నాయె? ఐనను శర్మగా రుపాయముగనే దాఁటిరి. 'పరంజానామి నత్వాం వినా' 'అను దానినిఁ నీవే' అను సేవార్థముతో గతార్థముం జేసిరి. సంస్కృతములోఁ గాదుగాని తెలుఁగులో యతిప్రాసలు, కవివ్యుత్పత్తిని—ధారను—శబ్దశుద్ధిని యొక్క నిమిసములో బట్టియిచ్చును. శర్మగారి యన్నిపద్యములు వీనికి లక్ష్యములే.

ధార తైలధారయేగాక, పంచదారపాకము ద్రాక్షను సైతము చేయును. అర్థసిద్ధి శబ్దశుద్ధితో సంబద్ధము. రసమా! ఓంఁ — అలంకారికుల గల్లచపటముతో నల్లన జాలువాఱు చుండును. కనుకనే రసజ్ఞులగు నాంధ్రులు రెండు ముద్రణముల ప్రతుల నిట్లే లీనము చేసుకొనిరి.

చిత్తగింపుడు
విధేయమిత్రము
మిన్నికంటి గురునాథశర్మ

PDF Compressor Pro

# కులశేఖరుఁడు

ఈ కవి. మహాజ్ఞానులని, యాళ్వారులని, దక్షిణదేశమందు ప్రసిద్ధిగన్న పన్నిద్ద ఱాళ్వారులలో నొకరు. ఈయన కేరళదేశమున (మలబారు) కోళపురము (తిరువక్కంజలము) ను రాజధానిగా నేలిన మహారాజు. దృఢవ్రత మహారాజీతని తండ్రి. ఈ కవి కాలము ప్రసిద్ధ కవులవలె పరిశోధకులకు వివాదాంశమైనను కలియుగము 28 వ సంవత్సరమునకు సరియగు శ్రీ పరాభవ నామ సంవత్సరమున మాసి(కుంభ) మాసమున పునర్వసు నక్షత్రమున దశమీ గురువారమున శ్రీహరి కౌస్తుభాంశమున నుదయించినట్లు సాధనాంతరములవలన నొక నిర్ణయమునకు రావచ్చును. తండ్రి వానప్రస్థము స్వీకరించిన పిమ్మట కులశేఖరుఁడు దిగ్విజయము గావించి, తన భక్తితత్త్వమును ప్రజలకు బోధించి సంసార తరుణోపాయమును జూపినాడు.

ఒకనాడు శ్రీ రామాయణ పురాణశ్రవణము చేయుసమయమున శ్రీరాముఁ డొక్కఁడే నలునదివేల రాక్షసుల నెదురింపనుండెనని ఖరదూషణ వధా సందర్భమున విని, యా జగదేకవీరునకుఁదానుగూడ సహాయ మొనరింప నెంచి సకల సేనాపరివృతుఁడై పయన మగుసరికి, ఖరదూషణ సంహారవార్తను విని శాంతించెననియు, నిట్టి తత్తరపాటుతోనే శ్రీసీతాపహరణఘట్టము విని, జగన్మాత యగు సీతామాతను నొక రావణుఁడా! కొనిపోవుట, తోడితెత్తునని సముద్రము జొచ్చి లంకాభిముఖమై జనఁగా నింతలో భక్తాభీష్టప్రదుఁడగు శ్రీరామచంద్రులు సీతాసమేతులై రావణ సంహారము మొదలగు నిజ లీలలతో సాక్షాత్కరించి శాంతింపజేసిరనియు చెప్పుచుందురు.

"మద్భక్తా యత్ర గాయంతి తత్ర తిష్ఠామి నారద"యను వాక్యానుసరణిని, శ్రీరామ సాక్షాత్కారము గల్గెననుట. నతిశయోక్తి గాదు. ఈ భక్తాగ్రగణ్యుఁడు.

PDF Compressor Pro



శ్రీ కృష్ణ నామమును కరదీపికచ్చే, మానవ హృదయాగారమున జ్ఞాన జ్యోతినివెల్గించి తన కుమారి రత్నముతోసహా, రాజ్యలక్ష్మిని, శ్రీరంగనాధుని కర్పించి, యరువది యేడవయేట మన్నారు కోవెలలో శ్రీ రాజగోపాలస్వామి సన్నిధిని పరమపదమొంది ధన్యజీవుడైనాడు. ఈ మహాశయుని భక్తిపారవశ్యము, జీవితాదర్శములు, కవితా మాధురి, ప్రతిశ్లోకమున ద్యోతక్యము. ఈయన సంస్కృతమునను, నరవమునను, బహు గ్రంధములు రచించెనట,. లభ్యములు కాని యితర గ్రంథములెటులున్నను నీ ముకుందమాల యొక్కటియే మానవ జీవిత సార్థక్యమునకు, లోక చరితార్థతకు, పరమ ప్రామాణిక మనుట నిర్వివాదాంశము. శ్రీ కులశేఖరులు దీని మూలకముగా నిత్యస్మరణీయులైరి.

(గ్రంథస్థ నిదర్శనములచే భక్తి ప్రబోధాత్మక గ్రంధములైన శ్రీకృష్ణ కర్ణామృతము శ్రీరామ కర్ణామృతము మొదలగు గ్రంథముల కంటే, నీ ముకుందమాలయే ప్రాచీనతరముగ దోచుచున్నది. యత్కించిత్ పాఠ భేదములతో, నైదాఱు శ్లోకములు పై గ్రంథములందు గానవచ్చుచున్నవి. వివాదాంశమైన, కవి కాల నిర్ణయమును విమర్శకులకే వదలుట సముచితము.)

PDF Compressor Pro

# శ్రీముకుందమాల

ముకుంద=మోక్షప్రదుఁడగు, శ్రీకృష్ణ పరమాత్మున కర్పించినమాల ముకుందమాల. ఇది శ్రీ కులశేఖర మహారాజ కృతము. ఈ భక్తాగ్రగణ్యుని భక్తిపారవశ్యము, మృదుమధుర వచోవైఖరి, యనర్గళ కవితా సంపత్తియు నీ ముకుందమాలయందు, ప్రతి శ్లోకమందును ద్యోతకమగుచుండును. తాను తరించుటయే గాక, విశ్వశ్రేయముగోరి, శ్రీ కృష్ణ మంత్రమునే, జన్మసాఫల్య మంత్రముగ నుపదేశించిన సహృదయుడు. నిరంతర భగవన్నామసంకీర్తనము చేతను, శ్రీరంగక్షేత్ర సందర్శనముచేతను, నవిరళ పురాణకాలక్షేపములచేతను తన ప్రజలు, జీవిత సార్థక్యము నొందవలెనని యా మహనీయుని యాశయము.

ఈ మాలాశ్లోకములన్నియు, పరమాత్మ యొక్క పవిత్రపదాబ్జములపై నిడిన సులలిత సుందర వాక్ప్రసూనములు. 'పాత్యేగేయేచ,' మధురములైన యీ శ్లోకము లాంధ్రద్రావిడ దక్షిణోత్తరదేశీయ భేదములేక దేశీయులందఱకు నాదరణపాత్రమైనవి. సార్వకాలిక మైనట్టియు, సార్వత్రిక మైనట్టియు, శ్రవణ మాత్రైక సుగమములైన, యీ శ్లోకములు వినినంతనే పఠనోత్సుకత కల్గించు ననుట యతిశయోక్తి కాదు. ఇంతటి ప్రశస్తికి, నిందలి పవిత్ర భక్తి ప్రభోధకు కారణము వివహాది శుభసమయములందు సైతమందలి శ్లోకముల నొకటి రెండైన నాలకింపనివా రుండరు. నాయనువాద ప్రయత్నమునకు గూడ, నిట్టి శ్రవణానుభవమే కారణమైనది. తొలుత వావిళ్ళవారి ప్రతిననుసరించి నలువది శ్లోకములనువదించితిని. అటు పిమ్మట వేఱొక ప్రతిలో నధిక పాఠముగ గన్పించిన యయిదు శ్లోకములనుపదింపబడినవి. తరువాత పత్రికలో బ్రకటింప బడిన శ్రీ ఆత్మకూరువారి ప్రతిలో నుత్తరదేశ మందు బ్రక్షిప్తములుగా నున్నవన్న పదునేను శ్లోకములుగూడ తెనిఁగించితిని.

ఈ గ్రంథముసం దుపపాదింపబడిన భక్తి ప్రబోధ ప్రభావమే నన్నీప్రయత్నమునకు బ్రేరేచినది. ముకుందమాలానువాదములు పలురూపములుగ ప్రచారములో నున్నను నెవఱి పుష్పసమర్పణమువలన వారికే ఫలముగదా! శ్రీరామాయణ కర్తలెందరులేరు.

PDF Compressor Pro



శ్లో॥ స్వసూక్తీనాం పాత్రం, రఘుకుల తిలకమేకం కలయతాం
కనీనాం కోదోషః సతుగుణగణానా మవగుణః (జయదేవః)

సాధ్యమైనంతవరకు, నీశ్లోకము లన్నియు కవి యభిప్రాయము ననుసరించి మూలానుసరణముగనే పరివర్తింపబడినవి. కొన్నింట భావవైశద్యమునకై పాఠాంతరములు బొందుపరచితిని.

కవి మంగళాచరణ శ్లోకములో "శ్రీవల్లభ" యని ప్రారంభించి తరువాత "జయతు జయతు దేవో" యని కీర్తించినాడు. వీరికి శ్రీరంగ క్షేత్రము కలియుగ వైకుంఠము. అట్లనే శేషాచలము (తిరుపతి). ఇందు సర్వత్ర శ్రీకృష్ణ స్మరణము. శ్రీకృష్ణ మంత్రము జపించుడని యుద్బోధించెను. శ్రీ నారాయణ చతురక్షరి, శ్రీనారాయణాష్టాక్షరి, శ్రీకృష్ణద్వ్యక్షరి, స్మరించి, జపించి, తరించుడని చేతులెత్తి మొఱపెట్టినాడు. మానవ జీవితము క్షణబుద్బుదప్రాయము. కఫ వాత పిత్తములు కంఠమడ్డినప్పుడు, నంత్యకాలమందు, శ్రీహరి స్మరణ కలుగునో కలుగదో, యిప్పుడే స్మరింపుడనియు; సంసార సాగరము దాటుటకు విష్ణువనే నావకంటె గత్యంతరము లేదనియు; నందుచే సత్సాంగత్యము, సత్కథా శ్రవణము, దుర్జన పరిత్యాగము. "అంతే నారాయణస్మృతిః" యనునట్టి స్థితిని పొందుటకు శ్రీహరి పాదారవిందము లందలి నిరంతర స్మరణ, మొదలగునవి భక్తి భూమికలుగా వరించినాడు. ప్రతి యింద్రియము, హరిసేవ కనువైననే సఫలమని, తత్సేవను "జిహ్వే కీర్తయ" యిత్యాదులచే యుద్బోధించినాడు. ప్రతిమాలుకొన్నాడు. ఇహపర సాధకములు, మణిమంత్రౌషధములు గాన, నందరిని, శ్రీకృష్ణ మణిని పొంది, శ్రీకృష్ణమంత్రము జపించి, శ్రీకృష్ణ రసాయనము నిండార ద్రావి శీఘ్ర నిర్వాణ మొందుడని ఘోషించినాడు. తన మనస్సు సాక్షాత్ ముకుంద పదారవింద మందిరమైపోవలెనన్నాడు. "మదన పరిహార స్థితిం మదీయే" .... భగవన్నామ స్మరణ, భగవద్రూపధ్యానము సేయుఁడని సర్వత్ర చాటినాడు. తొలుత "శ్రీవల్లభ"

PDF Compressor Pro



యని ప్రారంభించి, చివర "క్షీరసాగర తరంగ" యని ముగించినాడు. క్షీరసాగరములో మృదువైన భోగి భోగములపై, శ్రీమహాలక్ష్మి సహితుడై, పాల తుంపురులు తన దివ్య దేహముపైబడి, నక్షత్రకాంతులీన, శోభిల్లు శ్రీ వాసుదేవుని దివ్యమంగళ స్వరూపమును, కవితా శిల్పిగా చిత్రించినాడు. కొన్ని వృత్తములు పాటలుపాడునట్లుండును. చివర విడిగా ప్రకటించిన 15 శ్లోకములందలి భావము లుత్కృష్టములు: కాని యందలి కవితాధార శ్రీ కులశేఖరులదిగా తోచుటలేదు. కొన్ని చర్విత చర్వణములుగా రచింపబడినవి. ఈ విషయమును పాఠకులకే విమర్శనకు వదలితిని. వానిలో చివరి శ్లోకములో "అలమలమలం" అనుచోట కులశేఖరుల భక్తి, విశ్వాసము, స్థైర్యము గన దేహము పులకరించును. "చాలు చాలు మున్మాటికి చాలు. ప్రతి మానవుడు తానొనరించు మహాపాతకముల నడంప నొక కృష్ణనామమే చాలు, సంతయే ! నిరంతర శ్రీముకుందపదారవింద ధ్యానముచే శ్రీ మోక్షసామ్రాజ్యలక్ష్య కరతలామలకము లగునని యుద్బోధించెను". తొలుత మనవిజేసినట్లు యెవరికి వారె భగవత్పరముగా పుష్పము లర్పించి తరింతురని నా యాశయము. ప్రధానము హృయపుష్పము (పద్మము).

"కమలానాథ ! మదీయ మానసము లోకంబల్ల శోధించె, భక్తి మరందమ్ము స్రవించు హృద్వనజమున్ దీవ్యత్భవత్పాద పద్మములం దర్పణ సేయుదున్ గొను భవత్సాన్నిధ్యమున్జేరి, జన్మము సాఫల్యమునొందు పూజయిదె, కృష్ణా! వాసుదేవప్రభూ."

ఇట్లు
భక్తజన పాదరేణువు
గురుజాడ రాఘవశర్మ

PDF Compressor Pro

# శ్రీ శంకర విద్యాలయం, రేపల్లె, వ్యవస్థాపకులు:

తర్క-వ్యాకరణ వేదాంతపండిత, సాహిత్యవిద్యాప్రవీణ -

శాస్త్రవిశారద - ముళ్ళపూడి నారాయణశాస్త్రిగారు.

మకాం, రేపల్లె
20–0–47

చ॥ స్తుతులొనరించుటే నెరుగఁ దోఁచిన సత్యము పల్కుచుండుటే
మతమటుగాన, బందరున, మాటలధోరణిఁ గొన్ని పద్యముల్
శ్రుతిపథముం దగులొ-ని వచోరమణీమణి కిట్టి సూక్తులే
సతము సుభావహమ్ములని సాదరమొప్పఁగ నమ్మితిన్ మదిన్.

మ॥ పదలాలిత్యము భావగుంఫనము సద్భక్తిప్రభావాది సం
పద లొక్కమ్మడి, బ్రోవుచేసిన విధంబై దోఁచె నోహో! భవ
ద్వదనాంభోజ విముక్తమీకృతి ముకుందప్రేమ భావోజ్జ్వలం,
బదసీయాప్రతిమాన సౌరభము లాశాభోగమున్ బర్వెడిన్.

శ్లో॥ గుర్జరాడాన్వయచంద్రేణ వీరరాఘవశర్మణా
సూన్ తా ముకుందమాలేయం విదుషా భూషణాయతామ్.

ముళ్ళపూడి నారాయణశాస్త్రి

PDF Compressor Pro

# ముకుందమాల

శ్లో॥ ఘుష్యతే యస్య నగరే, రంగయాత్రా దినే దినే
తమహం శిరసా వందే రాజానం కులశేఖరమ్.

క॥ శ్రీరంగయాత్ర ప్రతిదిన, మే ఱేని పురమ్మునందు నింపుగ మ్రోగున్
సారెకు నా కులశేఖరు గూఱిచి నుతియింతు, శ్రీముకుందుని
భక్తున్.

తా॥ ఏ కులశేఖరరాజుయొక్క పట్టణమున ననుదినము శ్రీరంగపురంబును గూర్చిన ప్రయాణము చాటింపబడుచుండునో. యట్టి కులశేఖర రాజును, నేను శిరస్సుతో నమస్కరింతును.

శ్లో॥ కుంభే పునర్వసౌ జాతం కేరళే కోళపట్టణే
కౌస్తుభాంశం ధరాధీశం కులశేఖర మాశ్రియే.

చ॥ మును కులశేఖరుండగుచుఁ బూజ్య దృఢవ్రతపుత్రుఁడై, జనిం
చెను, గులశేఖరుండు నృపసీమను గేరళ, కోళపట్టణం
బున, సురమాతృ ఋక్షమునఁ బుణ్యపరాభవనామ వత్సరం
బున,హరికౌస్తుభాంశమునఁ మ్రొక్కెద నా మహితానుభావునిన్.

తా॥ కేరళదేశమున కోళపత్తనమందు (కళ్ళికోట), కుంభమాస పునర్వసు నక్షత్రమునందు, గౌస్తుభాంశమున నవతరించిన శ్రీ కులశేఖర భూపతి నాశ్ర యించెదను. కలియుగము 28—వ సంవత్సరము, పరాభవనామసంవత్సర కుంభ మాసమున, దృఢవ్రతుఁడను పుణ్యపురుషునకు శ్రీ కులశేఖ రాళ్వారులు జనించిరని ప్రతీతి.)

PDF Compressor Pro



శ్లో॥ శ్రీవల్లభేతి వరదేతి దయాపరేతి
భక్తప్రియేతి భవలుంఠన కోవిదేతి
నాథేతి నాగశయనేతి జగన్నివాసే
త్యాలాపనం ప్రతిపదం కురు మే ముకుంద.

క॥ శ్రీవల్లభ ! భవలుంఠన
కోవిద ! భక్తప్రియా ! ముకుందా : త్రైలో
క్యావాస ! దయాపర ! నా
థా ! వరదా ! నాగశయన ! యని; యన నిమ్మా.

తా॥ ఓ ముకుందా! (మోక్షప్రదాతా!) లక్ష్మీపతీ! వరదాయకా! దయాపరా! భక్తవల్లభా! సంసార నాశన నిపుణా! నాథా! శేషశయనా! జగదాధారా! యనెడి యాలాపన మెల్లపుడును, నాకు గల్గునట్లు చేయుము.

(పాఠాంతరము)

మ॥ వరదా! యంచు, జగన్నివాసయనుచున్ భక్తప్రియా! యంచు శ్రీ
హరి! శ్రీవల్లభయంచు, నాగశయనా! యంచున్! మురారీ! దయా
పర! యంచున్, భవలుంఠనప్రథితభావా! యంచు, నాథా! యటం
చును భక్తిం బలికింపు మాటికి మనం బూరన్ ముకుందప్రభూ!

శ్లో॥ జయతు జయతు దేవో దేవకీనందనోఽయం
జయతు జయతు కృష్ణో వృష్ణివంశ ప్రదీపః

PDF Compressor Pro



జయతు జయతు మేఘశ్యామలః కోమలాంగో
జయతు జయతు పృథ్వీభారనాశో ముకుందః. 2

మ॥ సకలోత్కృష్ట జయమ్ము మీకగుతఁ గృష్ణా! దేవకీనందనా!
సకలశ్రీ ఫలసిద్ధి మీకగుతఁ గృష్ణా! వృష్ణివంశప్రదీ
పక! పృథ్వీఘనభారనాశక! జయంబౌ మీకు నో కోమలాం
గ! కృపాసింధు! ముకుంద! నందసుత! మేఘశ్యామలా! శ్రీహరీ!

తా॥ శ్రీదేవకీదేవి తనయుండును, వృష్ణివంశమునకు ప్రకాశకుండును, మేఘమువలె నల్లనివాడును, సుకుమారమైన శరీరము గలవాడును, భూభారముహరించువాడును, మోక్షప్రదాతయు నగు శ్రీకృష్ణదేవుఁడు, సర్వోత్కృష్టుండగు గాత!

శ్లో॥ ముకుంద! మూర్ధ్నా ప్రణిపత్య యాచే
భవన్త మేకాన్త మియన్త మర్థమ్
అవిస్మృతి స్త్వచ్చరణారవిందే
భవే భవే మేఽస్తు భవత్ప్రసాదాత్. 3

శా॥ నా కీమాత్ర మనుగ్రహింపఁగ ముకుందా! శీర్షమున్ వంచి ని
న్నేకాంతమ్మునఁ జేరి వేడెద నిదే యేమందువేనిన్ మదిన్
నాకున్ ముందు ననుగ్రహించు ప్రతిజన్మంబందవిచ్ఛిన్నమౌ
నీ కల్యాణ పదాంబుజ స్మృతి సదా నే గోరెదన్ నీ దయన్.

తా॥ ఓ ముకుందా! శిరస్సుతో నమస్కరించి రహస్యముగ నిన్నింతమాత్రమే యాచింతును. (అది యేమన) నీ యనుగ్రహము వలనఁ బ్రతిజన్మమునను, నీ పాదారవిందములందు మఱపు కలుఁగకుండు గాక!

శ్లో॥ నాహం వందే తవ చరణయోర్ద్వంద్వ మద్వంద్వహేతోః
కుంభీపాకం గురుమపి హరే! నారకం నాపనేతుమ్

రమ్యా రామా మృదుతనులతా నందనే నాపి రన్తుమ్
భావేభావే హృదయభవనే భావయేయం భవన్తమ్. 4

మ॥ వెతచే ద్వంద్వనివృత్తి నిన్నడుగఁ గుంభీపాకపున్ ఘోరదు
ర్గతికిన్ బాపుమటంచు వేడను, సురా రామమ్మునన్ వేల్పు గు
బ్బెతలన్ గూడి చరించువేడ్క నిను నే వేడన్; మదేమున్న, మ
త్ప్రతి జన్మమ్మున భావమందిరమున భాసింప యాచించెదన్.

తా॥ ఓ శ్రీహరీ! నాకు శీతోష్ణ, సుఖదుఃఖాది ద్వంద్వ బాధలు తొలంగుటకుగాని, కుంభీపాకమను గొప్ప నరకయాతన దప్పించుటకుగాని, నందనవనమున సుందరమైన కోమలాంగులతో రమించుటకుగాని నీ పాదపద్మములకు నమస్కరించుట లేదు. జన్మజన్మల యందు నా హృదయమందిరమున, నిన్ను స్మరింతును గాక! (ఇందులకే నీపాదపద్మములకు నమస్కరించుచున్నాను).

శ్లో॥ నాస్థా ధర్మే న వసునిచయే నైవ కామోపభోగే
యద్యద్భవ్యం భవతు భగవన్! పూర్వకర్మానురూపమ్
ఏతత్ప్రార్థ్యం మమ బహుమతం జన్మజన్మాంతరేపి
త్వత్పాదాంభోరుహ యుగగతా నిశ్చలా భక్తిరస్తు. 5

మ॥ క్రమమహాధర్మమొ, కాంచనాదివసువో, కామోపభోగమ్మొ, లే
శముఁ గోరన్, లభియించుఁదామవియె, నిచ్చల్ పూర్వకర్మానురూ
పముగన్, గాఁగలకార్యముల్, మిగుల నే బ్రార్థింతు నా జన్మజ
న్మములన్, నిశ్చలభక్తిఁ గోరి, భగవన్! త్వత్పాదపద్మమ్ములన్.

తా॥ ఓ షడ్గుణైశ్వర్య సంపన్నుఁడా! (భగవంతుడా!) ధర్మార్థ కామములందు అనగా ధర్మాచరణమందుగాని, ధనసంచయమందుగాని, కామానుభవమందుగాని నాకాసక్తి లేదు. గత జన్మ కర్మానుగుణముగ నేది కావలసియున్నదో యది యగుగాక! ప్రతి జన్మమందును, నీపాదపద్మములయందచంచలమైన భక్తి కలుగుగాక! ఇదియే నాకభీష్టమైనదియై (గోరదగినదియై) యున్నది.

శ్లో॥ దివివా భువివా మమాస్తువాసో
నరకేవా నరకాంతక ! ప్రకామమ్
అవధీరిత శారదారవిందౌ 6
చరణౌ తే మరణేఽపి చింతయామి.

చ॥ తమదయ! నాకిఁకన్ దివిజధామ నివాసమొ, నారకప్రవా
సమొ, నరలోకవాసమొ, యొసంగిన, మిమ్మెటు రెట్టుసేయు, నం
తిమ సమయానఁగూడ నవధీరిత సుందర శారదారవిం
దములగు మీపదమ్ములె సదా నరకాంతక! సంస్మరించెదన్.

తా॥ నరకాసురుని సంహరించిన యోదేవా! స్వర్గమందుగాని, భూమియందు గాని లేక నరకమందుగాని, నాకెల్లప్పుడు నివాసమగుగాక! ఎట వసించినను శరత్కాల పద్మముల నధఃకరించు (దిరస్కరించు) నీ పాదయుగళమును, మరణకాలమంద పైతము స్మరింతును.

శ్లో॥ కృష్ణ ! త్వదీయ పదపంకజ పంజరాన్త
మద్యైవ మే విశతు మానస రాజహంసః
ప్రాణప్రయాణ సమయే కఫవాత పిత్తైః
కంఠావరోధన విధౌ స్మరణం కుతస్తే.

మ॥ అమితంబై కఫవాతపిత్తములు పై నడ్డంగఁ బ్రాణప్రయా
ణము సేకూరుతఱిన్ స్మరించుటెటు? కృష్ణా! మన్మనో రాజహ
సము నేడే భవదీయ పాద కమలాంచత్పంజరాంతః ప్రవే
శము గావించి సుఖించుగాక! పరమోత్సాహమ్ము భాసిల్లగన్

తా॥ ఓకృష్ణా! నా మానసమనెడి రాజహంస యిపుడే నీ పాదపద్మముల పంజరముఁ బ్రవేశించుగాక! ప్రాణముల బాయు సమయమున వాతపిత్త శ్లేష్మము కంఠము డగ్గుత్తిక పడగా నీ సంస్మరణ మెట్లుచేకూరును?

PDF Compressor Pro



శ్లో॥ చింతయామి హరిమేవ సంతతమ్
మంద మంద హసితాననాంబుజమ్
నందగోప తనయం పరాత్పరమ్
నారదాది ముని బృంద వందితమ్ 8

క॥ చిఱునవ్వు మొగముగల సుం
దరునిన్ శ్రీనందగోపనందనుని, బరా
త్పరు, నారదాది వందితు
హరినే, చింతింతు భక్తి, ననవరతమ్మున్.

తా॥ శ్రీ నారదాది మునిగణముచే నమస్కరింపఁబడువాడును, సర్వోత్కృష్టుఁడును. గోపాలకుఁడగు నందుని కుమారుండును, మందస్మిత ముఖారవిందుఁడును నగు శ్రీహరినే యెల్లప్పుడు స్మరింతును.

శ్లో॥ కరచరణ సరోజే కాంతిమ న్నేత్రమీనే
శ్రమముషి భుజవీచి వ్యాకులేఽగాధమార్గే
హరిసరసి విగాహ్యాఽఽపీయ తేజో జలౌఘం
భవమరు పరిఖిన్నః ఖేదమద్య త్యజామి. 9

మ॥ ఘనసంసార మరుప్రదేశ గతిచేఁ గ్లైన్ శ్రమంబెంతో, చ
క్కని నీపాదకరమ్ము లబ్జములు గాఁగ, నేత్రముల్ మీలటం
చును దోఁచున్, భుజవీచ మద్ధరి సరస్సున్ జేరి, లోనన్ మహా
ఘన తేజస్సలిలమ్ము గ్రోలి విడుతుం గాకింక నాయాసమున్.

తా॥ హస్తములు పాదములు ననెడి పద్మములు గలదియు, తళ తళ మెఱయుచున్న (కాంతిగల) నేత్రములనెడి చేపలతో గూడినదియు, బడలిక నుపశమింపఁజేయునదియు, భుజములనెడి యలలతో సంకుల మైనదియు లోతైన మార్గము

PDF Compressor Pro



గలదియు, నగు శ్రీహరియను సరస్సునందు దిగి, యా దేవుని దివ్యతేజస్సనెడి జలమును ద్రావి, సంసారమనెడి నిర్జలప్రదేశమున డస్సిన నే నిపుడే యీ బడలిక నుపశమింపఁ జేసికొనెదను.

(పాఠాంతరము)

చ॥ కరచరణారవిందములఁ గ్రాలుచుఁ గోరతిమ దక్షిమీనముల్
పరగ భుజాంతరంగముల భాసిలు శ్రీహరి నాము సత్సరో
వరమున మున్గి తేజమను వారిని గ్రోలి మరుప్రదేశ సం
చరణ మహాపరిశ్రమము సర్వముఁ బాసి సుఖింతు నెంతయున్.

శ్లో॥ సరసిజనయనే సశంఖచక్రే
మురభిది మావిరమ స్వచిత్త! రన్తుమ్
సుఖతర మపరం నజాతుజానే
హరిచరణ స్మరణామృతేన తుల్యమ్. 10

క॥ స్మరియింపు మెపుడు మురహరు
సరసిజనయనున్ సశంఖ చక్రుస్ భక్తిన్
చిరసుఖతర హరిచరణ
స్మరణామృత తుల్య మొండు జగమునఁ గలదే?

తా॥ ఓ మదీయ మానసమా! పుండరీకాక్షుండును, శంఖచక్రవిశిష్టుండును, మురాంతకుండును నగు శ్రీహరియందు విహరించుటకు వెనుదీయకుము. శ్రీహరి పాదచింతనామృతముతో సాటియైన, యానందమును గలుగఁజేయు మరియొక వస్తువును నే నెన్నడు నెఱుఁగను.

శ్లో॥ మాభీర్మందమనో! విచింత్య బహుధా యామీశ్చిరం యాతనాః
నామీనః ప్రభవంతిపాపరిపవ స్స్వామీ నను శ్రీధరః

PDF Compressor Pro



ఆలస్యం వ్యపనీయ భక్తిసులభం ధ్యాయస్వ నారాయణం
లోకస్య వ్యసనాపనోదనకరో దాసస్య కిం న క్షమః. 11

మ॥ వెఱపేలా! ఘనపాపశత్రునకు కుంభీపాక బాధాళికిన్
స్మరణీయుండగు స్వామి శ్రీధరుఁడె, యా నారాయణ ధ్యానమే
శరణోపాయము భక్తికిన్ సులభుఁడౌ, తాపత్రయంబాప్ప ది
ట్టరి లోకాళికి, నేమి చెప్పవలె? మూఢా! దాసుఁడౌ నీ యెడన్.

తా॥ ఓ మూఢ మానసమా! యమయాతనల దలఁచి భయపడకుము. పాపములను శత్రువులు, బాధింపవు. ప్రభువు శ్రీపతిగదా! ప్రాలుమాలక భక్తి సులభుండగు శ్రీమన్నారాయణు ధ్యానింపుము. లోకములో నాపదల హరించు నాతనికి తన దాసుని బాములఁబాపు టెంతపని?

శ్లో॥ భవజలధిగతానాం ద్వంద్వ వాతాహతానాం
సుతదుహితృ కళత్ర త్రాణ భారార్దితానామ్
విషమ విషయ తోయే మజ్జతా మప్లవానాం
భవతు శరణమేకో విష్ణుపోతో నరాణామ్. 12

మ॥ దరిలేనట్టి భవాబ్ధిలో సుత కళత్ర ద్రాణ భారమ్ము దు
ర్భరమై దింపఁగ ద్వంద్వ వాతతతి యూపన్ మాటికిన్ మున్గి,దు
స్తరమా దుర్విషయాంబు పూరముల నిచ్చల్ తూలు నవ్వారికిన్
దరణోపాయము విష్ణుపోతమొకటే దాటించు నేనాఁటికిన్.

తా॥ సంసారసాగరమున బ్రవేశించి శీతోష్ణములు, సుఖ దుఃఖములు ననెడి (విరుద్ధ) వాయువులచే కొట్టబడి, కుమారులు, కుమారితలు, భార్య మొదలగువారి, (పుత్రకళత్రాది) రక్షణయనెడి భారముచే పీడితులై తేలుటకు, తెప్పలేక, సంకటమగు భోగమనెడి జలమున మునిఁగిన మనుజులకు శ్రీవిష్ణువనెడి తెప్ప యొక్కటియే తరించు సాధనమగుగాక!

PDF Compressor Pro



శ్లో॥ భవజలధి మగాధం దుస్తరం నిస్తరేయం
కథ మహమితి చేతో! మాస్మగాః కాతరత్వమ్
సరసిజదృశి దేవే తావకీ భక్తిరేకా
నరకభిది నిషణ్ణా తారయిష్య త్యవశ్యమ్. 13

మ॥ తరియింపంగ నశక్యమై, కడు మగాధంబౌ మహాఘోర సం
సరణాబ్ధిన్ గని భీతి నొందకు మిఁకన్ సాధింపఁగా భక్తియే
తిరమౌ మార్గము గాన నా నరకభేదిన్ సారసాక్షున్ బరా
త్పరు, బద్మాధిపు నాశ్రయింపు మనసా! దాఁటించు నిక్కంబుగన్

తా॥ ఓ చిత్తమా! మిక్కిలి లోతు గలిగి దాట శక్యముగాని సంసార సాగరము నెట్లు తరింతునని పిఱికితనము నొందకుము. పుండరీక నేత్రుండును, నరకాంతకుండు నగు దేవునియందున్న నీదగు భక్తి యొక్కటియే తప్పక నిన్నుఁ దరింపఁజేయును.

శ్లో॥ తృష్ణాతోయే మదనపవనోద్ధూత మోహోర్మి మాలే
దారావర్తే తనయ సహజగ్రాహ సంఘాకులే చ
సంసారాఖ్యే మహతి జలధౌ మజ్జతాం నస్త్రిధామన్!
పాదాంభోజే వరద భవతో భక్తినావం ప్రయచ్ఛ. 14

మ॥ ఉరుమోహోర్మి చలించుచున్ మదన వాతోద్ధూతమై రేఁగ, భీ
కర తృష్ణాజలమందు, బుత్రసహజ గ్రాహమ్ములున్ లాఁగ, న
బ్బురమై ముంపఁగ దారలన్ సుడులు వాపోదున్ త్రిధామా! హరీ!
స్థిరమౌ మీ పదభక్తియే భవమహాబ్ధిన్ నావయౌ నాకిఁకన్.

తా॥ వరదాయకుఁడవగు ఓ త్రిధామా: ఆశ యనెడి నీరు గలదియు, మన్మథుఁడను గాలిచే లేపఁబడిన యజ్ఞానమను తరంగపంక్తి గలదియు, భార్యయను

PDF Compressor Pro



నీటిసుడి గలదియు, సుతులు సోదరులు ననెడి మొసళ్ళ సమూహము (నక్రచక్రము) చే వ్యాకులమైనదియు, నగు సంసారమను గొప్ప సముద్రమున మునుఁగుచున్న మాకు, మీ పాదపద్మములందు భక్తియనెడి తెప్పనొసంగుము.

శ్లో॥ మాద్రాక్షం క్షీణపుణ్యాన్ క్షణమపి భవతో భక్తిహీనాన్ పదాబ్జే
మా శ్రౌషం శ్రావ్యబంధం తవ చరిత మపాస్యాన్యదాఖ్యానజాతమ్
మాస్మార్షం మాధవ! త్వామపి భువనపతే! చేతసాఽపహ్నువానాన్
మాభూవం త్వత్సపర్య వ్యతికర రహితో జన్మజన్మాంతరేపి. 15

మ॥ కనఁజాలన్ గతపుణ్యు భక్తి నెఱుఁగంగా లేనివానిన్ భువిన్
వినఁజాలన్ మధురంపు మీకథ పనా వేఱెట్టిగాథల్ తలం
పను, నిన్ మానస నిందసేయు నొకఁడౌ పాపాత్మునిన్ మాధవా!
మనఁగోరన్ మఱి జన్మజన్మముల, యుష్మత్సేవ లేకున్నచో.

తా॥ లోకనాథుఁడవగు వో మాధవా: (శ్రియఃపతీ) నీ పాదపద్మములందు భక్తిలేని పుణ్యహీనులను (పాపాత్ములను) క్షణకాలమైనను చూడకుందును గాక! నీ దివ్యచారిత్రమును విడచి, వినఁదగని రచనగల యితర చరితల సమూహమును వినకుందునుగాక! మనసుతో నైనను నిను దూరువారిని స్మరియింపకుందును గాక! జన్మ జన్మయందును నీ సేవాసంపర్క శూన్యుఁడ గాకుందును గాక:

(పాఠాంతరము)

సీ॥ నీ పదాంబుజభక్తి నిముసమ్ముఁ గూర్పని
యట్టిహీనుఁడు పుట్టగిట్టనేమి?
తన పుణ్యమెల్ల వ్యర్థముసేయు నవివేకి
మనినేమి బొందితో మనకనేమి ?

PDF Compressor Pro



శ్రావ్యమా నీ కథాశ్రవణ మొల్లక కూళ
పెరకథ వినియేమి వినకయేమి?
నిన్ మానసమ్మున నిందించు పాపి, జీ
వించి యేమిఁక, మరణించి యేమి?

గీ॥ భావిజన్మములందు నీ సేవలేక
యున్న నేమిటికిన్, బుట్టకున్న నేమి?
యిట్టి దుస్థితి పాల్పడనీక నన్ను
ననయమున్ గనిపెట్టుమయ్యా! ముకుంద!

శ్లో॥ జిహ్వే! కీర్తయ కేశవం; మురరిపుం చేతో! భజ; శ్రీధరం
పాణిద్వంద్వ! సమర్చయాఽచ్యుతకథాః శ్రోత్రద్వయ! త్వం శృణు!
కృష్ణం లోకయ లోచనద్వయ! హరేర్గచ్ఛాంఘ్రియుగ్మాఽఽలయం;
జిఘ్ర ఘ్రాణ! ముకుంద పాదతులసీం; మూర్ధ! న్నమాధోక్షజమ్.

మ॥ మురవైరిన్ భజయింపు, కేశవుని సంబోధింపు, మర్చింపు శ్రీ
ధరుభక్తిన్, విను మచ్యుతున్ బలుకుగాథల్, కృష్ణువీక్షింపుమొం
టరిగా, మ్రొక్కు మధోక్షజున్ శిరముతోడన్, శ్రీహరిన్
గొల్చు మం
దిరమున్ జేరు, ముకుందపాద తులసిన్ వేవాసనల్ చూడుమా!

తా॥ ఓ రసనమా! (నాలుకా) కేశవుని గీర్తింపుము. ఓమానసమా! మురహరుని సేవింపుము. ఓ హస్తయుగళమా! శ్రీధరుని పూజింపుము. ఓ కర్ణద్వంద్వమా! అచ్యుతుని కథల నాకర్ణింపుము. ఓ నేత్రయుగ్మమా! శ్రీకృష్ణు నవలోకింపుము. ఓ చరణయుగ్మమా! శ్రీహరి నిలయమునకు పొమ్ము.

PDF Compressor Pro



ఓ నాసాపుటమా! ముకుందుని పాదములందున్న తులసిని వాసన జూడుము (ఆఘ్రాణింపుము). ఓ శిరమా! అధోక్షజునికి నమస్కరింపుము.

(పాఠాంతరం)

సీ॥ కేశవు గూరిచి కీర్తింపు మో జిహ్వ!
మురహరు నిఁక భజింపుము మనంబ!
చేదోయి! సంధిల్లి శ్రీధరుఁ బూజింపు,
శ్రోత్రముల్! వినుఁడి యచ్యుత కథాళి,
లోచనముల్! సమాలోకింపు డీ! కృష్ణు,
హరినిలయము జేరుమా! పదమ్మ!
శ్రీముకుందుని పదశ్రీ తులసీ దివ్య
వాసనల్ నాసికా! పఱచి చూడు.

గీ॥ భక్తిచే నధోక్షజు దివ్య పాదసరసి
జములకున్ శిరమా! నమస్కార మిడుము!
హరి యొసంగు శరీర మాయధిపు సేవ
కొఱకు నర్పించుటది మేలుకొఱకు గాదె!

శ్లో॥ హేలోకా! శృణుత ప్రసూతి మరణవ్యాధేశ్చికిత్సామిమాం
యోగజ్ఞాస్సముదాహరన్తిమునయోయాం యాజ్ఞవల్క్యాదయః
అన్తర్జ్యోతి రమేయ మేకమమృతం కృష్ణాఖ్య మాపీయతామ్!
తత్పీతం పరమౌషధం వితనుతే నిర్వాణ మాత్యన్తికమ్. 17

మ॥ తెలియం బల్కెదఁ బుట్టుచావులను వ్యాధిన్ యాజ్ఞవల్క్యాదియో
గులు కన్పెట్టిన మేటి మందిదిగో నీకున్ ఖ్యాతిమీరన్ ధరా
తల మందయ్యది యప్రమేయమయి యంతర్జ్యోతియై వెల్గు, నీ
వల కృష్ణామృతమాని వేగఁగొనుమీ యత్యంత నిర్వాణమున్.

PDF Compressor Pro



తా॥ ఓజనులారా: పుట్టుట గిట్టుట యనెడి రోగమునకు యోగవేత్తలగు యాజ్ఞవల్క్యాదిమునులు చెప్పిన చికిత్స వినుఁడు. హృదయాంతరాళ తేజోరూపమై ప్రకాశించు శ్రీకృష్ణరూపామృతముఁ ద్రావ మోక్షము గలుగును.

శ్లో॥ హే మర్త్యాః! పరమం హితం శ్రుణుత వో వక్ష్యామి సంక్షేపతః
సంసారార్ణవ మాపదూర్మిబహుళం సమ్యక్ప్రవిశ్య స్థితాః
నానాఽజ్ఞాన మపాస్య చేతసి నమో నారాయణాయే త్యముం
మంత్రం సప్రణవం ప్రణామసహితం ప్రావర్తయధ్వం ముహుః

మ॥ శ్రమయేలా? వినిపించెదన్ సులభ మార్గంబొండు మీకున్ రహ
స్యము, తొల్తన్ బ్రణవమ్ము జేర్చియు నమస్కారమ్ముతోఁ గూడ సం
తమునన్ సంస్మరియింపు మెప్పుడు, నమోనారాయణాయేతి మం
త్రము, దాఁటించెడు, దుఃఖభంగ భవపారావార మెల్లన్ ద్రుటిన్.

తా॥ విపత్తరంగములతో విస్తృతమైన సంసారసాగరమున మునింగిన మర్త్యులారా! మీ కొక రహస్యము జెప్పెద వినుఁడు. అజ్ఞానము వీడి ఓంకారము, నమస్కారముతో గూడిన "నారాయణాయ" యను మంత్రము జపింపుడు.

శ్లో॥ పృథ్వీ రేణు రణుః, పయాంసి కణికాః ఫల్గుః, స్ఫులింగో లఘు
స్తేజో, నిశ్వసనం మరుత్తనుతరం, రంధ్రం సుసూక్ష్మం నభః,
క్షుద్రా రుద్రపితామహ ప్రభృతయః, కీటాః సమస్తాః సురాః
దృష్టే యత్ర స తావకో విజయతే భూమావధూతావధిః. 19

మ॥ అవనీమండల మెల్ల ధూళి యగు, సూన్యంబౌ నభమ్మున్, జలా
ర్ణవమున్ బిందువునౌ స్ఫులింగములగున్ జండాగ్ని సూర్యుండు, వా
యువు నిట్టూర్పగు, కానుపింత్రు లఘువీర్యోపేతులై సర్వదా
దివిజుల్, నీ పరిపూర్ణమౌ మహిమ ముద్దీపించుపట్లన్ హరీ!

PDF Compressor Pro



తా॥ ఓ ముకుందా! యే నీ మహిమ చూడఁబడిన దగుచుండగా, పంచ భూతములు స్వల్పములగునో, యనఁగా, భూమి చిన్న రేణువుగను, జలము చిన్న బిందువుగను, తేజస్సు చిన్న మిణుగురుగను, వాయువు చిన్న నిట్టూర్పుగను, యాకాశము చిన్న రంధ్రముగను నుండునో, మఱియు హర హిరణ్య గర్భాది సమస్త దేవతలు (చిన్నపురుగులు) సూక్ష్మజీవులుగ నుందురో, యట్టి యనంతమైన నీ మహిమ సర్వోత్కృష్టమై ప్రకాశించుచున్నది.

(పాఠాంతరము)

సీ॥ పృథ్వీతలంబెల్ల రేణువై పడియుండు
బెద్ద సంద్రంబెల్ల బిందువు నగు
వాయువు మాఱు నిశ్వాసగా క్షణములో
నాకాశమెల్ల శూన్యముగఁ దోఁచుఁ
దేజస్స్వరూపులై దీపించు సూర్యచంద్రా
గ్నులు మిణుఁగురులై రహింత్రు
బ్రహ్మ రుద్రాది దైవతకోటి సూక్ష్మతి
సూక్ష్మజీవులుగఁ దోఁచున్ జగాన

గీ॥ నీ యనంత మహిమముందు నిల్చు నెద్ది
వ్యాప్తిఁ జెందెను నీ విభవమ్ము; పోల్చి
చెప్పనౌనె! నీ వన్నింటఁ జేరి యుంటి
వన్ని నీలోనఁ జేరెనయ్యా! ముకుంద!

శ్లో॥ బద్ధేనాంజలి నానతేన శిరసా గాత్రైస్సరోమోద్గమైః
కంఠేన స్వరగద్గదేన నయనే నోద్గీర్ణ బాష్పాంబునా
నిత్యం త్వచ్చరణారవింద యుగళ ధ్యానామృతాస్వాదినా
మస్మాకం సరసీరుహాక్ష! సతతం సంపద్యతాం జీవితం. 20

PDF Compressor Pro



మ॥ శిరమున్ వంచుచుఁ బుల్కరింపఁ దనువున్ జేదోయిఁ గీలించి, యా
తుర కంఠధ్వనితో, స్రవింపఁ గనులందున్ బాష్పముల్! నే నిరం
తరమున్ నీ చరణారవిందయుగళ ధ్యానామృతం బానఁగా
వరమిమ్మా! సరసీరుహాక్ష! సఫలత్వం బందు జన్మంబికన్.

తా॥ ఓ పుండరీకలోచనా, అంజలితో, వంగిన తలతోఁ బులకిత అవయవములతో, గద్గదస్వర కంఠముతో, నానందబాష్ప వ్యాప్తలోచనములతోఁ గూడి కొని యెల్లప్పుడు భవదీయ పాద పద్మ ద్వంద్వ చింతనామృతాస్వాదనము జేయుచుండఁగా మా జీవితము గడచుగాక।

శ్లో॥ హే గోపాలక! హే కృపాజలనిధే! హే సింధు కన్యాపతే!
హే కంసాంతక! హే గజేంద్ర కరుణాపారీణ! హే మాధవా!
హే రామానుజ! హే జగత్త్రయగురో! హే పుండరీకాక్ష! మాం
హే గోపీజననాథ! పాలయ పరం జానామి! న త్వాం వినా. 21

శా॥ ఓ గోపాలక! యో కృపాజలనిధీ! యో సింధు కన్యాపతీ!
యోగిధ్యేయ! గజేంద్రరక్ష! వరదా! యో పుండరీకాక్ష! రా
రా! గోపీజననాథ! కంసహర! శ్రీరామానుజా! దిక్కు నీ
వేగా! నన్గనుమీ! జగత్త్రయ గురూ! కృష్ణా! హరీ! మాధవా!

తా॥ ఓ గోపాలా। ఓ దయానిధీ। ఓ యబ్ధితనయా పతీ। ఓ కంసహరా। ఓ గజేంద్రరక్షకా। ఓ మాధవా। ఓ బలరామానుజా। ఓ జగద్గురూ। ఓ సరోజ నేత్రా। ఓ గోపీజనవల్లభా। నన్ను రక్షింపుము. నిన్నుతప్ప యితరుల నేనెఱుఁగను.

శ్లో॥ భక్తాపాయ భుజంగ గారుడమణి స్త్రైలోక్య రక్షామణి
ర్గోపీలోచన చాతకాంబుదమణి స్సౌందర్య ముద్రామణిః
యః కాంతామణి రుక్మిణీ ఘనకుచ ద్వంద్వైక భూషామణి
శ్శ్రేయో దేవ శిఖామణి ర్దిశతునో గోపాల చూడామణిః. 22

PDF Compressor Pro



మ॥ ఘనభక్తవ్యసనాహి గారుడమణీ! కాంతామణీ! రుక్మిణీ
స్తన భూషామణి! దేవతామణి! జగద్రక్షామణీ! గోపికా
జననేత్రాంబుజ చాతకాంబుదమణీ! చంచన్మరుత్వన్మణీ!
నిను గోపాల శిఖామణీ తలఁతుఁ దండ్రీ! భక్త చింతామణీ

తా॥ భక్తుల యాపదలను సర్పములకు గారుడమణి వంటివాడును, జగత్త్రియ రక్షణ దక్షుఁడును, గోపికల నేత్రము లనెడి చాతక పక్షులకు కాఱుమబ్బు వంటివాడును (అనగా సంతోష పఱచువాడు), సౌందర్యమునకు పరమావధి యైనవాడును; శ్రీరత్నమగు రుక్మిణీదేవియొక్క చనుగవ కలంకారమైన వాడును, దేవశ్రేష్ఠుఁడును, యాదవశిరో (భూషణ) రత్నము నగు శ్రీకృష్ణుఁడు, మాకు శుభముల నొసంగుగాత!

శ్లో॥ శత్రుచ్ఛేదైకమంత్రం సకలముపనిష ద్వాక్యసంపూజ్య మంత్రం
సంసారోత్తార మంత్రం సముపచిత తమస్సంఘ నిర్యాణమంత్రం
సర్వైశ్వర్యైకమంత్రం వ్యసన భుజగ సందష్ట సంత్రాణమంత్రం
జిహ్వే! శ్రీకృష్ణమంత్రం జప! జప! సతతం జన్మసాఫల్యమంత్రం

శా॥ వైరివ్రాత విభేదక, మ్ముపనిష ద్వాక్యప్రపూజ్యమ్ము, సం
సారోత్తారకమున్, దమోపహారమున్, సంపత్ప్రదమ్మున్, సదా
ధారమ్మున్, వ్యసనాహి దష్ట నరసంత్రాణమ్మునై యొప్పు సు
శ్రీరాజిల్లెడి కృష్ణమంత్ర మిదియే, జిహ్వా! జపింపంగదే.!

తా॥ శత్రుసంహారకమును, నుపనిషత్ప్రతిపాదితంబును, సంసార తారకంబును, ప్రబలాజ్ఞాన విధ్వంసకంబును, సకల సంపత్ప్రదంబును, నాపత్పన్నగ దష్టజనరక్షకంబును, జన్మ సాఫల్యకరంబును, నగు శ్రీకృష్ణమంత్రమును నోనాలుకా! నీ వెల్లప్పుడు జపింపుము.

PDF Compressor Pro



శ్లో॥ వ్యామోహ ప్రశమౌషధం మునిమనోవృత్తి ప్రవృత్త్యౌషధం
దైత్యేంద్రార్తికరౌషధం త్రిభువనీ సంజీవనైకౌషధం
భక్తాత్యంత హితౌషధం భవభయ ప్రధ్వంసనైకౌషధం
శ్రేయః ప్రాప్తికరౌషధం పిబ మనః! శ్రీకృష్ణ దివ్యౌషధమ్.

మ॥ దనుజశ్రేణి నణంచెడిన్, భవ భయ ధ్వంసమ్ము గావించెడిన్,
ముని హృద్వీధిఁజలింపఁజేసెడిని, వ్యామోహమ్ములన్ ద్రుంచెడిన్,
ఘన సంజీవనమై జగమ్ములకు భక్త శ్రేణికిన్ మేలుగా
ర్చిన శ్రీకృష్ణరసాయనంబు మనసా! సేవింపు మేలయ్యెడిన్.

తా॥ అజ్ఞాన నాశకంబును, మునుల మనోవ్యాపార ప్రవర్తకంబును, రాక్షస శ్రేష్ఠుల బాధించునదియు, ముల్లోకముల బ్రతికించునదియు, భక్తుల కిష్టమైనదియు, సంసార భయహరమును, సంపత్ప్రదంబు నగు శ్రీకృష్ణుఁడను దివ్యౌషధమును, మానసమా! త్రాగుము.

శ్లో॥ ఆమ్నాయాభ్యసనా న్యరణ్య రుదితం; వేదవ్రతా న్యన్వహం
మేదశ్ఛేదఫలాని; పూర్తవిధయ స్సర్వే హుతం భస్మని;
తీర్థానా మవగాహనానిచ గజస్నానం; వినాయత్పద
ద్వంద్వాంభోరుహ సంస్మృతిం, విజయతే దేవస్సనారాయణః.

మ॥ శ్రీనారాయణ పాదపద్మ యుగళిన్ జింతింపకే సామవుం
గానంబెల్ల నరణ్యరోదనము; గంగాస్నానమెల్లన్ గజ
స్నానంబౌఁ; దనుశోషణమ్ము వ్రతనిష్ఠల్, సేయు, మేల్ సప్తసం
తానంబుల్లన భస్మహవ్యమగు గానన్ భక్తి సేవింపుమా.!

తా॥ ఎవ్వని పాదచింతన వీడి, చేయబడిన వేదాధ్యయనము లరణ్యరోదనములో, కృచ్ఛ్రచాంద్రాయణాదులు శారీర కార్శ్యమ్మునకో; సప్తసంతానములు భస్మ హవ్యములో; గంగాది నదీస్నానములు గజస్నానములో, అట్టి శ్రీమన్నారాయణుఁడు శ్రేష్ఠుఁడై ప్రకాశించును.

శ్లో॥ శ్రీమన్నామ ప్రోచ్య నారాయణాఖ్యమ్
కే న ప్రాపు ర్వాంఛితం పాపినోఽపి
హా! నః పూర్వం వాక్ప్రవృత్తా న తస్మిన్
తేన ప్రాప్తం గర్భవాసాది దుఃఖమ్. 26

మ॥ మీనామము నారాయణ యంచుఁ బేర్కొనుచు స్వామీ! శ్రీపదా! వాంఛితా
ర్థము దానొందడె! పాపియెట్టిఁడు; నిఁకేరా! గర్భవాసాది దుః
ఖము ప్రాప్తించిన కారణమ్ము దెలిసెంగా నేమనం, బూర్వజ
న్మమునం దించుకయున్ స్మరింపమియగా, నానోట నీ నామమున్

తా॥ శ్రీమన్నారాయణుని నామస్మరణము జేసి, పాపాత్ములైనను, నెవ్వ రభీష్టఫలముల నొందలేదు? అయ్యో! పూర్వజన్మమున మన వాగింద్రియము శ్రీమన్నారాయణుని స్మరింపలేదు. అందువలననే మనకీ గర్భవాసాది దుఃఖములు సంప్రాప్తించినవి.

శ్లో॥ మజ్జన్మనః ఫలమిదం మధుకైటభారే!
మత్ప్రార్థనీయ మదనుగ్రహ ఏష ఏవ
త్వద్భృత్యభృత్య పరిచారిక భృత్య భృత్య
భృత్యస్య భృత్య ఇతిమాం స్మరలోకనాథ! 27

PDF Compressor Pro



క॥ తుదివానిఁగ నన్నిఁక నె
వన్మది నీదాసానుదాస మండలిఁ జేర్పం
గదె లోకనాథ! కృష్ణా!
యిదె నాకు ననుగ్రహింపుమీ! మధువైరీ!

తా॥ ఓమధుకైటభభేదీ! నా జన్మకుఁ బ్రయోజనమైనదియు, నేనుఁ గోరదగిన విషయమగు నీ యనుగ్రహ మిదియే. ఓ జగన్నాథా! దాసుఁడనగు నన్ను భవదీయ భృత్యకోటిలో నందరికంటె, చివరివానిగఁ దలంపుము.

(పాఠాంతరము)

చ॥ ననుఁ గరుణింపగాఁ దలఁచినన్ మధువైరి! యిదే మదీయ ప్రా
ర్థన; తమ దాసదాసునకు దాసునకున్ బ్రియదాసుఁడైన, యా
తని పద దాస దాసునకు దాసునిగా నయినన్ గ్రహింప, వం
దనమిదె లోకనాథ! జననంబది సార్థకమౌను నాకిఁకన్.

శ్లో॥ నాథే నః పురుషోత్తమే త్రిజగతా మేకాధిపే చేతసా
సేవ్యే స్వస్య పదస్య దాతరి సురే (పరే) నారాయణే తిష్ఠతి
యంకంచి త్పురుషాధమం కతిపయ గ్రామేశ మల్పార్థదం
సేవాయై మృగయామహే నరమహో! మూకా (మూఢా)
వరాకా వయం. 28

సీ॥ అరయ శ్రీనాథుఁడే? పురుషోత్తముఁడె! హరి
త్రైలోక్యములకెల్ల ప్రభువతండె?
భక్తులకున్ గొంగుపసిడి తావశ్యుఁడే?
స్వీయపథంబైన నీయదేవుఁ

PDF Compressor Pro



డట్టి నారాయణు నాశ్రయింపఁగలేక
స్వల్పార్థముల నీయజాలు నొకని
గొలది గ్రామంబులకున్ నేతయగు నొక
పురుషాధముని గొల్వఁబోవుటేల!

గీ॥ తనకె గతిలేని యొక్క కాతరుని జేరి
వేఁడు నీకంటె గ్రుడ్డిగూఁ వెఱ్ఱిగలఁడె!
కట్టిపెట్టునె! యతఁడు స్వర్గంబొకండు
తెలియుమా! యింక మూఢ! నీస్థితి యదేమొ!

తా॥ అయ్యో! మన మెంతమూఢులము! ముల్లోకముల కధిపతియై, మనసుచే సేవింపఁబడు బురుషోత్తముండును, ప్రకృతి కతీతుడై, తన స్థానము సహితము నిచ్చునట్టి శ్రీమన్నారాయణుం డుండఁగాఁ చిన్న పల్లెల పరిపాలించు నొక నరాధముని, సేవించు టెంత యవివేకము?

శ్లో॥ మదన! పరిహర స్థితిం మదీయే
మనసి ముకుంద పదారవింద ధామ్ని
హర నయన కృశానునా కృశోఽసి 29
స్మరసి నచక్ర పరాక్రమం మురారేః.

చ॥ త్వరపడి పొమ్మికన్ మదన! భద్రముకుంద పదారవింద మం
దిరమయి నిల్చె నా మనసు; నీకిట నిల్వఁగఁ దావులేదు మున్
హర నయనాగ్ని కీలలకు హా! సగమైతివి చిక్కి, పొమ్మికన్
హరి! హరి! నీ వెఱుంగవు, మురాంతక చక్రపరాక్రమం బిలన్.

తా॥ ఓ మన్మథా: శ్రీముకుందుని పాదపద్మములకు నిలయమైన నా మనసు సందు, నిలచు కోరిక (నివాసము) వీడుము. హర నేత్రాగ్నిచే సన్నగిల్లిన నీవు, నా హృదయమందున్న, మురారి చక్ర ప్రతాపమును దలంపవు.

PDF Compressor Pro



శ్లో॥ తత్త్వం బ్రువాణాని పరం పరస్మాత్
మధుక్షరన్తి సతాం ఫలాని
ప్రావర్తయ ప్రాంజలి రస్మి జిహ్వే!
నామాని నారాయణ గోచరాణి. 30

క॥ ఘనమగు పరతత్త్వం బును
వినిచెడి సుజనులకు ఫలము విధమున, నమృతం
బును వర్షించెడి, నారా
యణ నామముఁ బల్కు జిహ్వ! యంజలి నిత్తున్.

తా॥ ఓ నాలుకా! నీకు నేను దోసిలొగ్గితిని. గొప్పదానికంటె గొప్పది యగు సత్యవస్తువును, నన(గా పరాత్పరుఁడగు పరబ్రహ్మను బోధించునదియు, సత్పురుషులకు తేనెలొలుకు ఫలములవలె నుండు నారాయణ విషయకమైన నామములను పలుమాఱు జపింపుము (ఉచ్చరింపుము).

శ్లో॥ దారా వారాకర వరసుతా తే, తనూజో విరించిః
స్తోతా వేదస్తవ, సురగణో భృత్యవర్గః, ప్రసాదః
ముక్తి, ర్మాయా జగద వికలం తావకీ, దేవకీ తే
మాతా, మిత్రం బలరిపుసుత, స్త్వయ్యతోన్యన్న జానే. 31

ఉ॥ శ్రీ వరలక్ష్మి భార్యగ, విరించి సుతుండుగ, దల్లి దేవకీ
దేవిగ, మాయగా జగము, దీటగు భట్టుగ వేదమున్, సురల్
సేవకకోటిగా, నరుఁడు స్వీయసఖుండుగ, ముక్తియున్ దయా
భావముగా, నెఱుంగుదును, ద్వన్మహిమమ్ము, నెఱుంగ నన్యమున్

తా॥ సముద్రోత్తముని (పాలసముద్రుని) కుమారిత లక్ష్మి నీ భార్య; బ్రహ్మదేవుఁడు నీ సుతుఁడు; వేదము నిన్ను స్తుతించునది; దేవతలు నీ సేవకులు; యనుగ్రహమే మోక్షము. సమస్త ప్రపంచము నీ మాయయే. నీ తల్లి దేవకీదేవి.

PDF Compressor Pro



నీ చెలికాఁ డింద్రసుతుఁడగు నర్జునుఁడు. కావున నీ వింతవాఁడ వగుటంజేసి నీకంటె నితరుని నే నెఱుంగను.

శ్లో॥ ఇదం శరీరం పరిణామ పేశలం
పత త్యవశ్యం శ్లథసంధి జర్ఝరం
కిమౌషధైః క్లిశ్యసి మూఢ! దుర్మతే!
నిరామయం కృష్ణరసాయనం పిబ! 32

మ॥ భయ మేలా! యెపుడో యొకప్డు, పడిపోవన్ సిద్ధమై యుండు ని
శ్చయ మీ దేహము, వ్యాధిచే, ముదిమిచే సందీయఁ గీళ్ళన్నిదు
ర్నయమా నౌషధసేవకై పరితపింపంగా నిఁ కేలా! నిరా
మయమౌ కృష్ణరసాయనం, బనుభవింపన్ రాదె! మూఢాత్మకా!

తా॥ ఈ శరీరము ముసలితనముచే దుర్బలమై సంధిబంధముల వీడి, తప్పక నశించును. ఓ జ్ఞానహీనుఁడా! దుష్టబుద్ధికలవాఁడా! ఇతరౌషధములచే నేల కష్టపడెదవు! రోగముల దూరముజేయు శ్రీకృష్ణరసాయనమునుఁ ద్రావుము.

శ్లో॥ కృష్ణో రక్షతు నో జగత్త్రయగురుః; కృష్ణం నమస్యామ్యహం
కృష్ణేనామరశత్రవో వినిహతాః; కృష్ణాయ తస్మై నమః
కృష్ణా దేవ సముత్థితం, జగదిదం కృష్ణస్య దాసోస్మ్యహం
కృష్ణే తిష్ఠతి సర్వమేత దఖిలం; హే కృష్ణ! రక్షస్వమామ్. 33

ఉ॥ కృష్ణుఁడు రక్షకుం డగుతఁ గృష్ణుఁ బ్రణామము లాచరింతు శ్రీ
కృష్ణుని చేత దానవులు నీల్గిరి, కృష్ణునకై నమస్సు, శ్రీ
కృష్ణుని కంటె లేదెదియుఁ, గృష్ణునకున్ బదదాసుడన్ సదా
కృష్ణుని యందె నిల్చె మది,కృష్ణ! యహో ననుఁ గావరాదొకో!

తా॥ ముల్లోకములఁ బాలించు శ్రీకృష్ణుఁడు మనల రక్షించుగాక! నేను శ్రీకృష్ణునికి నమస్కరింతును. రాక్షస హంతకుండగు శ్రీకృష్ణునికి నమస్కారము. ఈ జగమంతయు శ్రీకృష్ణుని నుండియే పుట్టినది. నేను కృష్ణుని దాసుఁడను. ఈ లోకమెల్ల కృష్ణునియందే యున్నది. విశ్వ స్వరూపుఁడగు కృష్ణా! నన్ను కాపాడుము.

శ్లో॥ తత్త్వం ప్రసీద భగవన్! కురు మయ్యనాథే
విష్ణోః కృపాం పరమ కారుణికః కిలత్వమ్
సంసార సాగర నిమగ్న మనంత దీన
ముద్ధర్తు మర్హసి హరే! పురుషోత్తమోఽసి. 34

మ॥ భగవన్ వింటివె! నే ననాథుఁడ! మహా వాత్సల్యపూర్ణుండ వీ
వగుటన్ జేరితి నిన్ను, సంసరణ ఘోరాంబోధి, న న్నుద్ధరిం
పఁగదే! శ్రీ పురుషోత్తమా! మునిఁగి లేవంజాలకుంటిన్ హరీ!
తగఁ జేపట్టవె! సత్కృపన్ గని, యనంతా! యాపదోద్ధారకా!

తా॥ ఓ భగవంతుఁడా! ఓ విష్ణూ! నీవు దయావంతుడవుగదా! కావున నాకుఁ బ్రసన్నుఁడవు కమ్ము. దిక్కులేని నాయందు దయనుంచుము. పురుషోత్తముండవును, నాశ రహితుండవును, నగు శ్రీహరీ! సంసారార్ణవమున మునిఁగిన వీనిని లేవఁదీయఁ దగుదువు.

శ్లో॥ నమామి నారాయణ పాద పంకజం
కరోమి నారాయణ పూజనం సదా
వదామి నారాయణ నామ నిర్మలం
స్మరామి నారాయణ తత్త్వ మవ్యయమ్. 35

PDF Compressor Pro



శా॥ శ్రీ నారాయణపాదపద్మములకర్పింతున్ నమస్కారముల్
శ్రీ నారాయణ పాదపద్మములఁబూజింతున్ సదా భక్తితో
శ్రీ నారాయణ దివ్యనామములఁగీర్తింతున్ పవిత్రాత్మతన్
శ్రీ నారాయణ నిత్యతత్త్వము మదిం జింతింతు నశ్రాంతమున్.

తా॥ నేనెల్లప్పుడు శ్రీమన్నారాయణుని పాదపద్మములకే నమస్కరింతును. శ్రీమన్నారాయణునిఁ బూజింతును. పవిత్రమైన శ్రీ నారాయణ నామమునే యుచ్చరింతును. నాశ రహితమగు నారాయణరూపమగు పరతత్త్వమునే తలంచెదను.

శ్లో॥ శ్రీనాథ! నారాయణ! వాసుదేవ!
శ్రీ కృష్ణ! భక్తప్రియ! చక్రపాణే!
శ్రీ పద్మనాభాఽచ్యుత! కైటభారే!
శ్రీ రామ! పద్మాక్ష! హరే! మురారే! 36

శా॥ శ్రీనాథా! హరి! వాసుదేవ! వరదా! శ్రీ కృష్ణ! భక్తప్రియా!
శ్రీనారాయణ! చక్రపాణి! నృహరీ! శ్రీపద్మనాభాఽచ్యుతా!
శ్రీనాథా! మురవైరి! కైటభహరీ! శ్రీరామ! పద్మాక్ష! యం
చే నీ నామములన్ స్మరించు సువ్రతం, బిమ్మా! సదా భక్తిమై

శ్లో॥ అనంత! వైకుంఠ! ముకుంద! కృష్ణ!
గోవింద! దామోదర! మాధవేతి
వక్తుం సమర్థోఽపి న వక్తి కశ్చిత్
అహో! జనానాం వ్యసనాభిముఖ్యమ్. 3

PDF Compressor Pro


మ॥ నిను వైకుంఠ! ముకుందా! కంసదమనా! కృష్ణా! హరీ! నందనం
దనా! గోవిందా! యనంత! భక్తవరదా! దామోదరా! మాధవా!
యని నీ పేర్కొన శక్తిగల్గియు నొకండైనన్ స్మరింపండహో!
జను లెంచన్ వ్యసనైక సక్తులుగదా! సాధించు టెట్లో! నినున్.

(పై 2 శ్లో॥లకు తాత్పర్యము)

తా॥ ఓ లక్ష్మీపతీ! (మాధవా) నారాయణా! వసుదేవాత్మజా! కృష్ణా! భక్తజన వల్లభా! సుదర్శన (చక్ర) హస్తా! కమలనాభా! నాశరహితా! కైటభవైరీ! రామా! పుండరీకనేత్రా! హరీ! మురాంతకా! అనంతా! వైకుంఠా! మోక్షప్రదాయకా! గోవిందా! వనమాలీ! దామోదరా! శ్రీపతీ! యని యుచ్చరింప సమర్థుండుకూడ నుచ్చరించుటలేదు. అయ్యో! ఈ జనులకు దుఃఖముల యందే యభిరుచికదా!

శ్లో॥ధ్యాయంతి యే విష్ణు మనంత మవ్యయం
హృత్పద్మమధ్యే సతతం వ్యవస్థితమ్
సమాహితానాం సతతాఽభయప్రదం
తే యాంతి సిద్ధిం పరమాంచ వైష్ణవీమ్. 38

చ॥పదిలముగా మనమ్ము బిగఁబట్టి సునిశ్చలభక్తి నెవ్వఁడేన్
హృదయ సరోజ మధ్య కృత నిత్యనివాసు, ననంతు, నవ్యయున్
ముదమునఁగొల్చు, నయ్యనఘుఁ బ్రోచెడివిష్ణుఁడు, సంతతాభయ
ప్రదుఁడయి నిత్య నవ్య సుఖ వైష్ణవ సత్పదపీఠిఁ జేర్చుచున్.

తా॥ అంతము లేనివాడును, వికారములు లేనివాడును, సర్వవ్యాపకుండును, హృదయ కమల మధ్యమందు నిత్యనివాసియు, నేకాగ్రచిత్తుల కెల్లపుడు నభయ మిచ్చు శ్రీహరి నెవ్వరు ధ్యానింతురో, వా రుత్కృష్టమైనదియు, విష్ణు సంబంధమైన సిద్ధిని (వైకుంఠమును) బొందుదురు.

PDF Compressor Pro



శ్లో॥ క్షీర సాగర తరంగ శీకరా
సార తారకిత చారు మూర్తయే
భోగి భోగ శయనీయ శాయినే
మాధవాయ మధు విద్విషే నమః 39

చ॥ చెలువుగ, భోగిభోగమున క్షీరపయోనిధి బవ్వళించి, యం
దలి, తెలిపాలతుంపురులు దాఁకి, శరీరము తారకౌఘ కాం
తుల వెలిఁజిమ్మ, సర్వమొక నూత్న ప్రభన్ జెలువొందవెల్గు నిన్
దలఁచెద వాసుదేవ! వరదా! మధువిద్విష! మాధవా! హరీ!

తా॥ పాలకడలి యందలి యలలతుంపరల జడివానచే నక్షత్రవంతముగ నున్న మనోహరమగు శరీరము కలవాడును, నాదిశేషుని శరీరమను పాన్పునందు బరుండువాడును, మధురాక్షస వైరియు నగు శ్రీపతికి నమస్కారము.

శ్లో॥ యస్యప్రియౌ శ్రుతిధరౌ కవిలోక వీరౌ
మిత్రే ద్విజన్మ వర పద్మ శరావభూతామ్
తేనాంబుజాక్ష చరణాంబుజ షట్పదేన
రాజ్ఞా కృతాకృతి రియం కులశేఖరేణ. 40

చ॥ కవివరులున్ ప్రసిద్ధ శ్రుతికంఠులు పద్మశరాభిధుల్ ద్విజ
న్మ వరులు మిత్రులెవ్వనికి, మాధవ దివ్యపదారవింద మం
దవిరళ భక్తి యెవ్వనికి, నా కులశేఖర చక్రవర్తి, భ
క్తి వివశతన్ రచించె నిదె, తేనెలుఁగుల్కు ముకుందమాలఁదాన్

తా॥ లోకప్రియులు, వేదవేత్తలు, కవిజనశ్రేష్ఠులు, బ్రాహ్మణోత్తములు నగు శ్రీపద్మనాభ శర (బాణ) కవు లెవ్వని మిత్రులో, యట్టివాడును, పద్మనేత్రుని బాదపద్మములకు తుమ్మెదవంటివాడును, నసఁగా సేవకుండు నగు శ్రీ కులశేఖర మహారాజుచే నీ కృతి రచింపఁబడెను. (ఈ పద్యమునందలి పూర్వార్థము ననేక విధములుగ నర్థము చెప్పుచున్నారు.)

PDF Compressor Pro



## అధిక శ్లోకములు

(ఈ మొదటి శ్లోకము బృహత్ స్తోత్ర రత్నాకరమునందు, మదరాసు ఓరియంటల్ లైబ్రరీయందు ఆంధ్రాక్షర వ్రాత ప్రతులలో మొదటి శ్లోకముగా నున్నది.)

శ్లో॥ వందే ముకుంద మరవింద దళాయతాక్షం
కుందేందు శంఖ దశనం శిశు గోపవేషమ్
ఇంద్రాది దేవగణ వందిత పాదపీఠమ్
బృందావనాలయ మహం వసుదేవ సూనుమ్. 41

ఉ॥ శ్రీ వసుదేవ నందను విరించి సురేంద్ర మునీంద్ర కోటి సం
భావిత పాదుఁ గుంద శశి భాసిత శుభ్ర రదున్, గృపాళు రా
జీవ దళాయతాక్షుఁ బరిసేవిత గోపకిశోర వేషు, బృం
దావనవాసు నీ మనసు నం, దనిశమ్ము ముకుంద! కొల్చెదన్.

తా॥ మోక్ష ప్రదాయకుండును, పద్మనేత్రుండును, మల్లెపూవువలె, చంద్రునివలె, శంఖమువలె వెల్లనైన దంతములుగలవాడును, గోపబాలకవేష ధారియు, ఇంద్రుఁడు మొదలగు దేవబృందముచే నమస్కరింపఁబడిన చరణములుఁ గలవాడును, బృందావనవాసియు, వసుదేవసుతుండు నగు శ్రీకృష్ణునికి నమస్కరింతును.

శ్లో॥ శ్రీగోవింద పదాంభోజ మధునో మహదద్భుతం
తాత్పాయినో నముంచంతి ముంచంతి యదపాయినః. 42

(తత్పాయినో నముహ్యంతి ముహ్యంతి, యదపాయినః)

మ॥ చిరకాలీన తపః ఫలంబునను సంసిద్ధించు గోవింద సుం
దర పాదాంబుజ నవ్య దివ్య మకరంద శ్రీ ప్రభావ మ్మహో
కరమాశ్చర్యము! దానిఁ ద్రావఁగల భాగ్యం బెట్టిదో వీడ నే
రరు త్రావన్! దురదృష్టవంతుఁ డొకఁడే త్రావంగ లేకే విడున్.

తా॥ శ్రీ గోపాలుని చరణకమల మకరందముయొక్క మహిమ యాశ్చర్యకరమైనది. ఆ మకరందము నాస్వాదించువారు మోహమునొందరు దానిని గ్రోలనివారు మోహము (అజ్ఞానము) నొందుదురు. (మోహము అనగా మూర్ఛ) లోకమున మద్యము ద్రావినవారు మోహమొందుదురు. త్రావనివారు మోహమందరు. ఈ పద్యము (మకరందము) గుణముచే దానికి కేవలము వ్యతిరేకము. విరుద్ధముగనున్నది. అందుచే నిది యాశ్చర్యకరమైనది.

శ్లో॥ రజసి నిపతితానాం మోహ జలావృతానాం
జనన మరణ దోలా దుర్గ సంసర్గ గానాం
శరణ మశరణానా మేక ఏవాతురాణాం
కుశల పథ నియుక్త శ్చక్రపాణి ర్నరాణామ్. 43

మ॥ అమిత క్లేశ పథంబటం చెఱుఁగకే, యజ్ఞానులై, మోహ జా
లములన్ జిక్కుచు, జన్మ కర్మ భవదోలన్ దూఁగు నవ్వారికిన్
శ్రమ నిఁ జీరెడి యార్తకోటికి, శరణ్యం బొండు లేనట్టి యు
త్తమ భక్తాళికిఁ జక్రపాణి యొకఁడే, తాఁదోడి దిక్కై చనున్.

తా॥ పాపమునఁ బడి, యజ్ఞానమగు వలచే నావరింపఁబడి పుట్టుట గిట్టుట (చచ్చుట) యనెడి ప్రవేశింప శక్యముకాని యుయ్యేల నధిరోహించి, రక్షకుఁడు లేక, పీడితులైన నరులకు చక్రముఁబూని మంచిమార్గమును జూపు శ్రీకృష్ణుఁడొక్కఁడే రక్షకుఁడు.

PDF Compressor Pro



శ్లో॥ అపరాధ సహస్ర సంకులే పతితం భీమ భవార్ణవోదరే
అగతిం, శరణాగతం హరే! కృపయా కేవల మాత్మసాత్కురు.

చ॥ ప్రతిదిన మెన్నరాని, యపరాధ సహస్రము లేను జేసితిన్
బతితుఁడ, ఘోర సంసరణ వారిధి లోన మునింగి భీతినొం
దితి, గతిలేదు నాకెడియు, దిక్కుఁక నీవె హరీ! ననున్ గృపా
మతి, క్షమియించి యేలుకొనుమా! దరిఁజేరిచి యుద్ధరించుచున్.

తా॥ అనేక యపరాధముల (పాపముల) చే వ్యాకులమై భయంకరమైన సంసారసాగర మధ్యమునఁ బడి గతిలేక నిన్ను శరణము పొందిన నన్ను శ్రీహరీ! నీ దయచేతను మాత్రమే నీ యధీనము చేసికొనుము.

శ్లో॥ మామే స్త్రీత్వం మాచ మేస్యాత్కుభావః
మామూర్ఖత్వం మా కుదేశేషు జన్మ
మిథ్యాదృష్టి ర్మాచ మేస్యాత్కదాచి
జ్జాతే జ్జాతే విష్ణుభక్తో భవేయమ్. 45

మ॥ వనితా జన్మము నొందనీయ, కెద దుర్భావమ్ము రానీయ, కెం
దును మూర్ఖత్వము బొందనీయక, దురాత్ముల్ పుట్టు దేశమ్మునం
దునఁ బుట్టింపక, దుష్ట నాస్తికత యందున్ బుద్ధి పోనీయకే,
ననుఁ బాలింపుము విష్ణుభక్తునిగ జన్మంబిచ్చి మున్ముందిఁకన్.

తా॥ ఓ దేవా! నా కెప్పుడును, యాడజన్మ లేకుండుగాక! నీచభావములు కలుగకుండు గాక! మూఢతనము లేకుండుగాక! నీచ (పాపముగల) దేశమునందుఁ బుట్టుక కల్గకుండుగాక! అసత్య మం (నాస్తికత) దాసక్తి లేకుండుగాక! జన్మ జన్మ యందు విష్ణుభక్తుఁడ నగుదుగాక!

PDF Compressor Pro



## ఉత్తర దేశీయ పుస్తకగత శిష్ట శ్లోకములు

శ్లో॥ యత్కృష్ణ ప్రణిపాత ధూళి ధవళం తద్వర్ష్మ, తద్వై శిర
స్తేనే త్రే తమసోజ్ఝితే సురచిరే యాభ్యాం హరిర్దృశ్యతే
సాబుద్ధి ర్విమలేందు శంఖ ధవళా యామాధవధ్యాయినీ
సాజిహ్వాఽమృత వర్షిణీ ప్రతిపదం యాస్తౌతి నారాయణమ్.

మ॥ స్థిరమౌ భక్తిదలిర్పఁ గృష్ణునకు వాసిన్ మ్రొక్కుచో ధూళిధూ
సరితంబౌ నవె శీర్షమున్ దనువు, నశ్రాంతమ్ము శ్రీ మాధవున్
స్మరియింపం గలదే సుబుద్ధి హరి గాంచంజాలు నవ్వే కనుల్
వరనారాయణుగూర్చి వాగమృతమున్ వర్షింపఁదా జిహ్వయౌ.

తా॥ శ్రీకృష్ణునికి సాష్టాంగ ప్రణామంబు లొసరించుటవలన భూరజోధూసరితమైన తనువే, తనువు, అట్టి శిరమే శిరము. శ్రీహరి జూచు కనులే యజ్ఞానాంధకార వినిర్ముక్తములగుటచే మిక్కిలి ప్రకాశించు కనులు. శ్రీపతిని ధ్యానించు బుద్ధియే కళంకరహితమైన చంద్రునివలెను, శంఖమువలెను స్వచ్ఛమైన బుద్ధి. శ్రీమన్నారాయణునిస్తుతించు నాలుకయే ప్రతి పదమున నమృతమును వర్షించు నాలుక, అనగా భగవత్కైంకర్యమునకు వినియుక్తమైనచో శరీరము సార్థకము, లేనిచో నిరర్థకము అని భావము.

(పాఠాంతరము)

సీ॥ సాష్టాంగ మెఱుఁగ కృష్ణ పదమ్ములకు భక్తి
ధరణి రజముఁ దూగు తనువు తనువు
కృష్ణు నమస్కృతుల్ సేయు ధాత్రీరజ
శ్రీమాళి రాజిలు శిరము శిరము

PDF Compressor Pro



అంధకారముఁ బాయు హరి సురుచిర మూర్తిఁ
గాంచఁగా వెల్గెడి కనులు కనులు
ప్రవిమల శశి శంఖ ధవళమై మాధవు
పేరి పేరి ధ్యానించు బుద్ధి బుద్ధి
గీ॥ ప్రతిపదమ్మున నమృతవర్షమ్ము భక్తి
జిందు నారాయణు నుతించి జిహ్వ జిహ్వ
త్రికరణమ్ములఁ గృష్ణు నర్చించు నదియె
సార్థకంబగు మానుష జన్మ జన్మ.

శ్లో॥ నాథే ధాతరి భోగిభోగశయనే నారాయణే మాధవే
దేవే దేవకినందనే సురవరే చక్రాయుధే శార్ఙ్గిణి
లీలాఽశేష జగత్ప్రపంచ జఠరే విశ్వేశ్వరే శ్రీధరే
గోవిందే కురుచిత్తవృత్తిమచలామన్యైస్తు కిం వర్తనైః! 47

శా॥ శ్రీనారాయణు ధాతనున్ సురవరున్ శ్రీదేవకీ నందనున్
శ్రీనాథున్ నిఖిల ప్రపంచజఠరున్ శ్రీశార్ఙ్గిఁ జక్రాయుధున్
శ్రీనాథున్ హరి మాధవున్ మురహరున్ విశ్వేశు, గోవిందునిన్
ధ్యానింపందగు స్వస్థచిత్తమున, నేలా! భ్రాంతి యీయాయెడన్

తా॥ మనకు ప్రభువును, పోషకుఁడును, శేషతల్పశాయియు, మనుజుల కావాసమైనవాడును, శ్రీపతియు, దేవుఁడును, దేవకీసుతుండును, దేవోత్తముండును, చక్రశార్ఙ్గ ధనస్సుల ధరించినవాడును, సమస్త జగచ్చక్రమును సనాయాసముగ గర్భమందు ధరించు జగదీశుఁడును శోభావంతుఁడు నగు శ్రీ గోపాల దేవునందు, నో మానసమా! నీ వ్యాపారము నుంచుము. ఇతర వ్యవహారములతో నీ కేమి లాభము?

PDF Compressor Pro



శ్లో॥ శ్రీనాథ! నారాయణ! వాసుదేవ!
గోవింద! దామోదర! చక్రపాణే!
పద్మనాభా! ఽచ్యుత! కైటభారే!
కంసఘ్న! పద్మాప్రియ! శార్ఙ్గపాణే! 48

శా॥ శ్రీనాథా! హరి! వాసుదేవ! వరదా! శ్రీకృష్ణ! పద్మాప్రియా!
శ్రీనారాయణ! చక్రపాణి! నృహరీ! శ్రీపద్మనాభాఽచ్యుతా!
శ్రీనాథా! మధువైరి! కంసహర! శార్ఙ్గీ! దేవ! గోవింద! యం
చే నీనామములన్ స్మరించు సుకృతం బీవయ్య! దామోదరా!

శ్లో॥ అనంతా! వైకుంఠ! ముకుంద! రామ!
జనార్దనాఽనంద! నిరామయేతి
వక్తుం సమర్థోఽపి నవక్తి కశ్చి
దహో! జనానాం వ్యసనాభిముఖ్యమ్. 49

మ॥ నిను వైకుంఠ! ముకుంద! రామ! నృహరీ! కృష్ణా! హరీ! శ్రీజనా
ర్దన! యానందనిరామయాఽచ్యుత! యనంతా! మాధవా! శ్రీధరా
యని, నిన్ బేర్కొన శక్తి గల్గియు, నొకండైనన్ స్మరింపం డహో!
జనులెంచన్ వ్యసనైకసక్తులు గదా సాధించు టెట్లో నినున్.

(పై 2 శ్లో॥లకు తాత్పర్యము)

తా॥ మాధవా! నారాయణా! వసుదేవ తనయా! గోపాలా! వనమాలీ! చక్ర (ధరా) హస్తా! కమలానాభా! వికార రహితా! కైటభవైరీ! కంస సంహారా! లక్ష్మీ వల్లభా! శార్ఙ్గధరా! నాశ రహితా! వైకుంఠా! ముక్తి ప్రదాయకా! రామా!

PDF Compressor Pro



దుష్టజన శిక్షకా! ఆనందమయు! రోగ విదూరా! అనియుచ్చరింప శక్తిఁ గలవాఁడు కూడ నుచ్చరింనుటలేదు. అయ్యోః ఈః జనులకు దుఃఖములం దెంత రుచి! (వ్యసనము).

శ్లో॥ శ్రుత్వా జనార్ధన కథా గుణ కీర్తనాని
దేహేన యస్య పులకోద్గమ రోమ రాజిః
నోత్పద్యతే నయనయో ర్విమలాంబు ధారా
ధిక్తస్య జీవిత మహో పురుషాధమస్య. 50

మ॥ మననేలా! పురుషాధముండయి తలంపన్ లేక కృష్ణున్ జనా
ర్ధన చారిత్ర గుణాను కీర్తన సుధన్ ద్రావన్ వెసన్ రోమరా
జి నిగుడ్పన్ బులకింపమేను, పెనదృష్టిన్ లేక బాష్పాంబుధా
రను దూగాడిన వాడెపూరుషుఁడు సార్థక్యమ్ము తజ్జన్మమున్.

(పాఠాంతరము)

గీ॥ శ్రీ జనార్ధను దివ్య చరిత సుగుణ
కీర్తనన్ దేహమది పులకింపఁ దేని
విమలభాష్పంబు ధారస్రవింపఁ దేని
పరమ పాపిష్టుఁ డవ్వాని బ్రతుకు బ్రతుకె!

తా॥ శ్రీ జనార్ధనుని చరితలను గాని గుణస్మరణములనుగాని, వినగనేయెవ్వని శరీరమున పులకలెత్తవో; యెవ్వని కనుఁగవ యందు, నానంద బాష్పసంతతి బయల్వెడలదో; ఆ నరాధముని జన్మ వ్యర్థముగదా!

శ్లో॥ అంధస్య మే హృతవివేక మహాధనస్య
చోరైః ప్రభో! బలిభి రింద్రియ నామధేయైః
మోహాంధకూప కుహరే వినిపాతితస్య
దేవేశ! దేహి కృపణస్య కరావలంబమ్.

మ॥ క్రమ మేపారగ నింద్రియమ్ములను పేరన్ దస్కరుల్ జ్ఞాన వి
త్తము బల్మిన్ హరియించి త్రోసిరి యగాధంబైన మోహాంధకూ
పమునన్, మున్గి తపించు దీనుఁడను, లేవం దీయుమయ్యా! యవ
శ్యము కేలూఁత యొసంగి నాకిఁక ముకుందా! కృష్ణ! భక్తప్రియా

తా॥ ప్రభూ! ప్రబలములై, యింద్రియము లనెడి చోరులు, సదసద్వివేకమను గొప్ప ధనము నపహరించుటచే, నంధుఁడనైన నన్ను నజ్ఞానమను నంధకారముచే నిండిన పెనునూతిలో బడవైచిరి. దేవ దేవా! అట్టి యీ దీనునకుఁ జేయూత నొసంగుము.

శ్లో॥ ఆశ్చర్యమేతద్ధి మనుష్యలోకే
సుధాం పరిత్యజ్య విషం పిబంతి
నామాని నారాయణ గోచరాణి
త్యక్త్వాన్యవాచః కుహకాః పఠంతి. 52

మ॥ కరమాశ్చర్య మహో విచిత్రమిది లోకమ్మున్ విలోకింప నీ
నరు లింపౌ సుధఁ ద్రావలేక విష మున్మాదమునన్ గ్రోల జూ
తురు, నారాయణు దివ్యనామముల సంతోషింపరేలా! హరీ
తర లోకవ్యవహార వాక్యముల మోదంబందుచున్ మూఢులై.

తా॥ ఈ మర్త్యలోకంబున శ్రీమన్నారాయణ విషయకమగు నామముల విడచి, నీచ లితర వాక్కుల బ్రసంగించుటఁ జూడ, నమృతమును వదలి కాలకూటమును ద్రావుచున్నట్లున్నది. ఇది యెంత యాశ్చర్యకరమైన విషయము!

శ్లో॥ త్యజన్తు బాంధవాస్సర్వే నిందంతు గురవో జనాః
తథాపి పరమానన్దో గోవిందో మను జీవనమ్. 53

PDF Compressor Pro



ఆ-వె॥ బాంధవాళి నన్ను బరిహరించును గాక
గురుజనాళి తలఁపు దిరుగు గాక
అగు మదీయ జీవి తానంద మూర్తి గో
విందు డొకఁడె, ప్రాణ బీజ మతఁడె.

తా॥ బందుగులెల్లరు నన్ను వీడినను సరే. పెద్దలు (బాల్యమున పాఠశాలాధ్యాపకులు మొదలగువారు) నను దూరినను సరే, నిరతిశయానంద రూపుఁడగు, శ్రీ గోవిందుఁడే (గోపాల కృష్ణుఁడే). నా జీవగఱ్ఱ (జీవనాధారము) కావుననే నాతని విడువనని భావము.

శ్లో॥ చేత! శ్చింతయ, కీర్తయ స్వరసనే! నమ్రీభవ త్వం శిరో!
హస్తా! వంజలి సంపుటం రచయతం, వందస్వదీర్ఘం వపుః!
ఆత్మన్! సంశ్రయ పుండరీకనయనం నాగచలేంద్రస్థితం
ధన్యం పుణ్యతమం తదేవ పరమం దైవంహి సంసిద్ధయే. 54

మ॥ శిరమున్, వంచి నమస్కరింపు! మదిలోఁజింతింపు, కీర్తింపు!జి
హ్వా!రసంబూర, ఘటింపుమంజలిని, సాష్టాంగమ్ముగాఁగాయమున్
ధరపై జేర్పుము, పుండరీకనయనున్ నాగాచలేంద్రస్థితున్.
శరణం బొందుము దేవదేవుఁ డతడే సంసిద్ధిఁ జేకూర్చెడున్.

తా॥ శేషాచల వాసియు, కమలనేత్రుండును, నగు శ్రీపతిని నో మానసమా! ధ్యానింపుము. నాలుకా! నీవు కీర్తింపుము. ఓశిరమా! (ఆదేవునికి) నమస్కరింపుము. ఓ చేతులారా! దోసిలి యొగ్గుడు. ఓ శరీరమా! సాష్టాంగప్రణామ మాచరింపుము. ఓ జీవా! వాని నాశ్రయింపుము. శ్రేష్ఠమును బవిత్రమును నగు నా దైవమే మోక్షమునిచ్చు పరమ దైవతము.

(పాఠాంతరము)

PDF Compressor Pro



సీ॥ మనమా! తలంపుమా! మాధవు నే(ప్రొద్దు
జిహ్వా! కీర్తింపుమా! శ్రీనివాసు
శిరమా! నమస్కృతిఁ జేయుమా హరికీవు
కరమ! కరముఁగూర్చి కాంచు మీశు
లోచనమా! సమాలోకింపుమా! కృష్ణుఁ
గర్ణమా! హరిగుణ కథను! వినుమ!
దేహమా! భక్తి ధాత్రిన్ (వాలు, హరి ముందు
పదమ! పద హరి నివాసమునకు

గీ॥ దివ్య నాగాచలేంద్ర సంస్థితుని భక్తి
నాశ్రయింపుమా! పుండరీకాక్షుఁడొకఁడె
స్వీయభక్తులఁ గావ సంసిద్ధుఁడగుట
పరమ దైవముఁ భక్త కల్పక మతండు.

శ్లో॥ సత్యం బ్రవీమి మనుజా స్స్వయ మూర్ధ్వబాహు
ర్యోయో ముకుంద! నరసింహ! జనార్దనేతి
జీవో జప త్యనుదినం మరణే రణేవా
పాషాణ కాష్ఠ సదృశాయ దదా త్యభీష్టమ్. 55

మ॥ జనులారా! కరమెత్తి చాటెద నిదే సత్యమ్ము దానెవ్వఁడై
నను. నిత్యమ్ము జపించుచున్ హరి! ముకుందా! నారసింహా! జనా
ర్దన! యంచున్ శిలపోల్కి కట్టెవలె స్థైర్యంబూని నిల్వన్ రణ
మ్మునఁ బ్రాణాంతమునందు భక్తికలనంబొందున్ నిజాభీష్టముల్.

PDF Compressor Pro



తా॥ ఓ జనులారా! రెండుచేతుల నెత్తి సత్యమైన సంగతిని చెప్పుచున్నాను ఏ జీవుఁడనవరతము, ముకుందా! నరసింహా! జనార్దనా! యని జపించునో; మరణ సమయమునగాని, యుద్ధమునగాని, మూర్ఛాదులచే రాతివలె లేక కొయ్యవలె నున్నను నట్టివానికి (భక్తునకు) మోక్షమునిచ్చును.

శ్లో॥ నారాయణాయ నమ ఇత్యమమేవ మంత్రం
సంసార ఘోర విష నిర్హరణాయ నిత్యం
శృణ్వంతు భవ్య మతయో యతయోఽను రాగా
దుచ్చైస్తరా ముపది శామ్యహ మూర్ధ్వబాహుః॥ 56

మ॥ వినుఁడీ మోక్షపథానువర్తులు బుధుల్ ప్రేమించు మార్గం బిదే
ఘన సంసార మహా విషాపహృతి దక్షంబౌచు రక్షించు సా
ధనమున్ జాటెదఁ జేతులెత్తి యిదె సత్యంబంచు "నారాయణా
య నమో" యన్న సుమంత్ర రాజమిది దివ్యానందసంధాతయౌ.

తా॥ సంసారమను కాలకూట విషమును హరించుటకై 'నారాయణాయ నమః' అను నీ మంత్రమునే యెల్లప్పుడు బిగ్గఱగా చేతులెత్తి నే నుపదేశించుచున్నాను. మంచిబుద్ధిగలవారును నియమవంతులు నగు జను లాస్థతో వినుదురుగాక.

శ్లో॥ చిత్తం నైవ వివర్తతే క్షణమపి శ్రీకృష్ణపాదాంబుజాత్
నిందంతు ప్రియబాంధవా గురుజనా గృహ్ణంతు ముంచంతువా
దుర్వాదం పరిఘోషయంతు మనుజా వంశే కళంకోఽస్తువా
తాదృక్ప్రేమభరానురక్త మిహమే మత్తాయమానం॥

మ॥ నను నిందిచిన సాటిబంధువులు గురుల్ నన్వీడినన్ జీరినన్
జన దుర్వాదము గల్గినన్, విమల వంశంబెంతయున్ మచ్చఁదా
ల్చిన; నా చిత్తము వీడఁబోదు క్షణమున్ శ్రీకృష్ణపాదాబ ది
వ్యనివాసమ్మునఁ దదీయప్రేమ భర సౌఖ్య శ్రీ మహామత్తమై.

PDF Compressor Pro



తా॥ శ్రీకృష్ణుని పాదకమలమునుండి నా మనసొక నిమేషకాలమాత్రమైనను మరలదు. ఆప్తులగు బంధుజనులు నిందించినను సరే; పెద్దలు నన్ను స్వీకరించినను వదలినను సరే; జనులెల్ల లోపవాదమునను చాటించినను సరే; మా వంశమునకు కళంకము కలిగినను సరే; నా మనసు శ్రీకృష్ణునియందు జెప్పనలవి గాని యనురాగము గలిగి మదించి యున్నది.

ఈ శ్లోకము గోపికలు చెప్పినది అప్పుడు తుదిపాదమునకు నాల్గవ చరణమున 'ఇహానః' (నః=మాయొక్క) అని పాఠము, 'ఇహామే' అని మార్చి కులశేఖరుఁడు గోపికలవలె తనకుగల భక్తిని వెలువరించుకొనెను (మే=నాయొక్క).

శ్లో॥ ప్రణామ మీశస్య శిరః ఫలంవిదు
స్తద్దర్శనం పాణి ఫలం దివౌకసః
మనః ఫలం తద్గుణ తత్త్వ చింతనం 58
వచః ఫలం తద్గుణ కీర్తనం బుధాః

చ॥ పులకిత దేహుఁడై హరికిఁ మ్రొక్కుటయే తగ శీర్షమంటకున్
ఫలము, తదర్చనన్ సలుపు భాగ్యమె పాణిఫలమ్ము, చింతనల్
సలుపుటె చిత్తమంటకు ఫలమ్ము, తదీశుని దివ్యకీర్తనల్
పలుకుటయే వచఃఫలము పండితులార! గ్రహింప వేడెదన్!

తా॥ శిరస్సున్నందుకు భగవంతుని నమస్కరించుటయు, చేతులున్నందుకు దేవునిఁ బూజించుటయు, మనస్సున్నందుకు పరమేశ్వరుని గుణములయొక్క తత్త్వమును ధ్యానించుటయు, వాక్కున్నందుకు సర్వేశ్వరుని గుణముల కీర్తించుటయు ఫలములని దేవతలుఁ బండితులు తలంతురు.

PDF Compressor Pro



శ్లో॥అల మల మల మేకా ప్రాణినాం పాతకానాం
నిరసన విషయే యా కృష్ణ కృష్ణేతి వాణీ
యది భవతి ముకుందే భక్తి రానంద సాంద్రా
విలుఠతి చరణాబ్జే మోక్ష సామ్రాజ్యలక్ష్మీః. 59

గీ॥పాతకమ్ము సమస్తమ్ము బాఱద్రోలఁ
జాలు నొక కృష్ణ నామమే చాలుఁ జాలు
స్థిర ముకుందుని భక్తి సిద్ధించునేని
వ్రాలుఁ బదముల మోక్ష సామ్రాజ్యలక్ష్మి.

తా॥ జీవుల సమస్త పాపములను పోగొట్టుటకు కృష్ణ! కృష్ణ! యను నామ మొక్కటియే ముమ్మాటికిఁ జాలును. మోక్షప్రదాతయగు శ్రీమన్నారాయణుని యం దానందముచే నిబిడమైన భక్తి కల్గెనేని మోక్ష రాజ్యలక్ష్మి యఱచేత నున్నదియే యగు.

(పాఠాంతరము)

శా॥శ్రీకృష్ణా! హరి! కృష్ణ! కృష్ణ యని కీర్తింపంగ నే ప్రాణికిన్
బోకారున్ దురితమ్ము లెల్ల ననిశమ్మున్ శ్రీముకుందున్ మదిన్
సాకల్యంబుగఁ గొల్చు భాగ్య మదియుండన్ మోక్ష
సామ్రాజ్య ల
క్ష్మీ కారుణ్య కటాక్ష వీక్షణము లక్షీణమ్ముగాఁ జేకుఱున్.

శ్లో॥ ముకుందమాలాం పఠతాం నరాణాం
అశేష సౌఖ్యం లభతే నకస్స్విత్ (కోవా)
సమస్త పాపక్షయ మేత్య దేహీ
ప్రయాతి విష్ణోః పరమం పదం తత్ 60

PDF Compressor Pro



చ॥ నిరతము భక్తిభావ మెదనిండ స్రవింప ముకుందమాల నె
వ్వరు పఠియింతురో సతము వారి కశేష సుఖమ్ములబ్బు స
త్వరమె ధరన్ సమస్త దురితక్షయ మేర్పడ నంత మందుఁ దాఁ
బరమ పదమ్ము నాఁ బఱగు వైష్ణవ సత్పదపీఠి జేకుఱున్.

తా॥ ముకుందునకు సంబంధించిన యీ పద్యమాలను పఠించు మనుజులలో నెవ్వఁడు సమస్త సౌఖ్యముల నొందడు? (అందఱు పొందుదురు) ప్రతి ప్రాణియు ముకుందమాలను పఠించుట వలన సమస్త పాపనాశమునొంది యుత్తమమైనదియు ప్రసిద్ధమైనదియు నగు (శ్రీవిష్ణువు యొక్క) స్థానము ననఁగా మోక్షమును పొందును.

మ॥ చనిరం డియ్యదె కృష్ణకల్పక మిటన్ సంకల్ప మాత్రమ్మ చే
తనె వర్షించు నభీష్ట, మేల! యిటు నిత్యమ్మున్ వృథా వారి పీ
రిని సేవింపఁగ, నెల్లలోకముల శ్రీకృష్ణుండె పుట్టింపఁ బెం
పనుఁ దా లోన మఱల్ప కర్తయగు దైవం, బాట సేవింపుమా!

మ॥ స్థిరవాసం బెదియో సుఖం బెదియొ గుర్తింప లేకే వృథా
పరువుల్ పెట్టితిఁ గాలమున్ గడిచెఁ బై, వార్ధక్యమున్ వెంట జే
కుఱ, గత్యంతర మేమిలే దెచట నాకున్ దిక్కు గానన్ వడిన్
శరణం బొందెద శ్రీముకుంద చరణాబ్జాతమ్ములన్ నిత్యమున్.

చ॥ సులలిత వాక్సుమమ్ములను జుట్టిన మాల, యిలన్ దమాల నీ
ల, లలిత సుందరాంగముఁ జెలంగి పెనంగిన కుందమాల, ప్రో
జ్జ్వల శశికాంత చంద్రికలు పండిన దివ్య ముకుందమాల, యిం
దలి ప్రతి పుష్ప రాజిత సుధారస మాని సుఖింపుడీ! జనుల్.

PDF Compressor Pro



ఉ॥ శ్రీకులశేఖరుల్ మును తరింప జగమ్ముకై "ముకుందమాల" సు
శ్రీకరలీలఁ గూర్చిరి ప్రసిద్ధముగా నది నేఁ దరింపఁగా
మీ కరుణాకటాక్షమున మేలగు తెన్గునఁ దీర్చి యిచ్చెదన్
మీకిదె, రాఘవుండఁ గనుమీ! కృపతోడ, ముకుంద!మాధవా!

శ్లో॥ కాయేన వాచా మనసేంద్రియైర్వా
బుద్ధ్యాత్మనా వా ప్రకృతే స్స్వభావాత్
కరోమి యద్య త్సకలం పరస్మై
నారాయణాయేతి సమర్పయామి.

మ॥ తను హృద్భాషల, నింద్రియ ప్రతతి చేతన్ బుద్ధిచే నంతరా
త్మను, స్వాభావిక శక్తియా ప్రకృతి చేతన్ బ్రేరణన్ బొంది నే,
ననిశమ్మున్ బచరించు చుండు సకల వ్యాపారముల్ నీకె య
ర్పణ గావింతు గ్రహింపుమయ్య! కరుణా పారీణ! నారాయణా!

తా॥ శరీరముచేగాని, వాక్కుచేగాని, మనస్సుచే గాని, యితరేంద్రియములచే గాని, బుద్ధిచే గాని, నా పూర్వజన్మ కర్మ ననుసరించి గాని, నేను దేనిని చేయుదునో యది యంతయు పరమాత్మయగు శ్రీమన్నారాయణునకే యని సమర్పించెదను.

శ్రీకృష్ణార్పణ మస్తు.

శ్రీ శ్రీ శ్రీ శ్రీ శ్రీ

PDF Compressor Pro

# బృందావన ప్రసూనములు

వెల

1. శ్రీ వాసుదేవనామ శతకము (చతుర్థ ముద్రణము)
శ్రీకృష్ణాష్టోత్తర శతనామముల ననుసరించి యొక్కొక్క
పద్యమునం దొక్కొక్క నామార్థమును గూర్చి వ్యాఖ్యాన
ప్రాయముగా వ్రాసిన భక్తిప్రబోధాత్మక శతకము. .... 1—00

2. ముకుందమాల (పంచమ ముద్రణము)
శ్రీ కులశేఖరాళ్వారుల సంస్కృత ముకుందమాలకు
పద్యానువాదము. 60 శ్లోకములు, పద్యములు, తాత్పర్య
సహితము. .... 2—50

3. నవకాళి (ద్వితీయ ముద్రణము)
మహాత్ముని అహింసా విజయ యాత్ర—భీభత్స భయానక,
కరుణరస ఖండకావ్యము .... 1—00

4. కల్పలత (చతుర్థ ముద్రణము)
వినతి, సందర్శనము, వాత్సల్యము, పోతనామాత్యుడు,
గోపికా హృదయము, వేడికోలు, శ్రద్ధాంజలి, గ్రహ స్తవము,
కల్పలత మొదలగు నవశాఖల విరాజిల్లు ఖండకావ్య సంపుటి,
5 విశ్వవిద్యాలయములచే బి. యే. పాఠ్య గ్రంథముగా నిర్ణ
యింపబడిన సరళ గ్రంథము. సాధారణ ప్రతి .... 3—00

5. స్వాతంత్ర్య పథము (ద్వితీయ ముద్రణ) .... 5—00

6. కాళరాత్రి
"కోస్తాంధ్ర ఉప్పెన" గురించిన ఖండకావ్యము, 22 తుఫా
నుల చరిత్రతో ప్రముఖ పండితులు, సాంస్కృతిక విద్యా
వంతుల ప్రశంసలతో .... 5—50

PDF Compressor Pro

జాతీయ గీతములు, 685 కృతుల
జాతీయగేయముల సంపుటి – ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీవారి ప్రచురణ. రు. 12-00

శ్రీమహాలక్ష్మి దివ్య గుణ వైశిష్ట్యము
శ్రీమహాలక్ష్మీ స్తవము – శ్రీసూక్తము ఆంధ్ర పద్యానువాద సహితము

అంజలి
శ్రీ పరమహంస పరివ్రాజకాచార్యవర్య శ్రీ మచ్ఛంకర భగవత్పాద ప్రతిష్ఠిత శ్రీ కాంచీ కామకోటి పీఠాధిపతి శ్రీ జగద్గురు శ్రీ మచ్చంద్రశేఖరేంద్ర సరస్వతీ పూజ్య పాదుల మహిమ, సందర్శనము, పర్యటనా విశేషముల గూర్చిన పద్యసంపుటి.

---

## రాబోవు గ్రంథములు

1. సిద్ధేంద్రయోగి (నాటకము)
కూచిపూడి భరతనాట్య గురువులు సుప్రసిద్ధ కవీంద్రులు నగు సిద్ధేంద్రయోగి జీవితచరిత్ర, యక్షగాన, సహితము.

2. పవిత్ర యాత్రావలోకన (పద్య సంపుటి) భారతదేశ మందలి ఉత్తర దక్షిణ పవిత్ర యాత్రాస్థలముల సందర్శనము, మహాత్మ్యం మొదలగు విశేషములతో కూడిన పద్యకావ్యము.

3. భక్తిరసైక స్తోత్రసంపుటి–శ్లోకములు, అనువాద పద్యములు గేయములు సహితము.

4. భ్రమరగీతలు – ఖండకావ్యము (పద్యములు)